ప్రజాశక్తి సోపతి
మార్చి 15, 2015 ఆదివారం అనుబంధం

ఏకాంతవాసం
ఆమె సాహిత్యానికి ప్రేరణ

అనువాదం ఓ సృజనోత్సవం

- తమ్మెర రాధిక కథ : పనిమనిషికో దండం
- కవిత్వానికి కొత్త శోభ
- అలరించే జానపద బాణీలు
- మల్లారెడ్డి మురళీమోహన్, విల్సన్‌రావు కవితలు

మూడున్నర దశాబ్దాల 'మాభూమి'



తెలంగాణ సినిమా మూలాల్ని తెలుసుకునే క్రమంలో గుర్తు చేసుకోవాల్సిన చిత్రం 'మాభూమి'. 1980లో విడుదలయిన సినిమా ఇది. మూడున్నర దశాబ్దాల తర్వాత కూడా ఆ సినిమాకు ప్రాసంగికత వుంది. ఏ భూమి సమస్యనయితే ఇతివృత్తంగా స్వీకరించిందో అది ఇంకా అపరిష్కృతంగానే వున్నది. సుప్రసిద్ధ రచయిత కిషన్ చందర్ సృజించిన 'జబ్ ఖేత్ జాగే' ఈ సినిమాకు మూలకథ. గౌతమ్‌ఘోష్ దర్శకత్వంలో నిర్మితమైన ఈ చిత్రం 1948 పూర్వపు తెలంగాణ దృశ్యాన్ని ఆవిష్కరించింది. 1930–48 ప్రాంతంలో హైదరాబాద్‌ను ఏలిన నిజాం ప్రభువుల కాలంలోని కార్మికుల స్థితిగతుల్ని, పల్లెల్లో దొరలకు వ్యతిరేకంగా పాదుకున్న చైతన్యాన్ని, అది పోరాటంగా పరిణమించిన వైనాన్ని 'మాభూమి'లో చూస్తాం. తెలంగాణ సాయుధపోరాటం మీద వచ్చిన చిత్రంగా దీనికి ప్రాధాన్యం వుంది. బి.నరసింగరావు, జి.రవీంద్రనాథ్ నిర్మాణకర్తలుగా వ్యవహరించారు. బి.నరసింగరావు ఆలోచన ఈ సినిమా రూపు దిద్దుకోడానికి ప్రేరణ. తెలంగాణ సినిమా గురించి ప్రస్తావించుకుంటే మొదట గుర్తు వచ్చే చిత్రమిది. ఇది విడుదలయిన రోజుల్లో సినిమా చూడటం కోసం పల్లెల్నించి జనాలు బండ్లు కట్టుకొని థియేటర్లకు తరలివచ్చారు. గద్దర్, సంధ్యలు పాడిన పాటలు అనేకమంది అనేకానేక పర్యాయాలు విన్నారు. జనంలోకి ఆ పాటలు ఎంతగానో చొచ్చుకుపోయాయి. జాతీయ, అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ఎన్నో పురస్కారాలు అందుకున్న సినిమా ఇది. మూడున్నర దశాబ్దాల అనంతరం కూడా తరగని ప్రాముఖ్యం, ప్రాధాన్యం వున్న చిత్రం 'మాభూమి'.

ఆ పాట ఒక క్లాసిక్



విన్న కొద్దీ వినాలనిపించే పాటలు చాలా అరుదు. మళ్ళీ మళ్ళీ విన్నప్పటికీ ఎప్పటికప్పుడు ఓ కొత్త మాధుర్యాన్ని ప్రోది చేసే లక్షణం కొన్ని పాటలకే పరిమితం. అలాంటి అరుదైన అందమైన పాట 'సాత్ సాత్' చిత్రంలో జావేద్ అఖ్తర్ పాడిన పాట. ఫరూఖ్‌షేక్, దీప్తినావల్ మీద చిత్రీకరించిన పాట ఇది. 'తుమ్ కో దేఖా తో యె ఖయల్' చిత్రీకరణలో వైవిధ్యం, సౌందర్యం తొంగిచూస్తాయి. జగ్జీత్‌సింగ్ కంఠస్వరంలోంచి ఒలికిన పాటలోని రాగమాధుర్యం అలవికానిది. 1982లో వచ్చిన ఈ చిత్రం ఒక తరానికి మరపురాని అనుభూతుల్ని అందించింది. కథానాయిక "నువ్వు కవిత్వం కూడా రాస్తావా" అని అడిగి, కవిత్వం వినిపించమన్నప్పుడు కథానాయకుడయిన కవి స్పందించి పాడినప్పటి గీతమిది. జగ్జీత్‌సింగ్ పాడిన విధానం, చిత్రీకరణలో దీప్తినావల్, ఫరూఖ్‌షేక్ చూపిన అభినయం ఈ పాటకి హైలైట్. యూట్యూబ్‌లో చూసి ఈ పాటని విన్నవాళ్ళు మరల మరల వినాలనుకుంటారు. ప్రేమకు సంబంధించిన భావాన్ని అతి సున్నితంగా, ఆర్ద్రంగా, అందంగా అభివ్యక్తం చేయడంలో కవి చూపిన ప్రతిభ అనన్యం. కాలంలో ఎన్నో మార్పులు రావచ్చు, జీవితాలు ఎన్ని మలుపులయినా తిరగవచ్చు, చిన్ననాటి జ్ఞాపకం లాంటి ఓ పాట మాత్రం తనలోని మాధుర్యాన్ని, అంతరంగంలోని తడిని మాత్రం కోల్పోదు. ఇందుకు తార్కాణంగా నిలిచే ఈ పాటని ఒకసారి వినండి. 'సాత్ సాత్' చిత్రాన్ని కూడా వీలయితే ఓ సారి చూడండి. 1980ల కాలంలో మానవీయమైన ప్రేమకోణాన్ని దృశ్యకావ్యంగా మలచడంలో దర్శకుడు చూపిన ప్రతిభ ఏమిటో తెలుస్తుంది.

సారాంశం

ప్రకృతినీ, ఆధునిక విజ్ఞానపు పోకడల్ని ఆకళింపు చేసుకుంటూ బతుకును సమన్వయం చేసుకోవడంలోనే జీవితానికి అర్థం వుంది. బుద్ధికి సంబంధించిన పనులు పెరిగిన కొద్దీ మనుషులు ప్రకృతికి దూరమవుతుంటారని కొందరు ప్రకృతి తత్వవేత్తలు చెబుతుంటారు. కానీ మనిషి మెదడు అత్యంత శక్తివంతమైంది. సహజంగా జీవించటమంటే ప్రకృతిని యథాతథంగా అనుసరించడమని అర్థం చేసుకోవడం పొరపాటు అవగాహన. ప్రకృతి సమతుల్యానికి ముప్పు వాటిల్లకుండా విజ్ఞాన ఫలాల్ని అందుకోవడం అవసరం. దీనిని గుర్తించి వ్యవహరించడంలోనే జీవన సారాంశం ఇమిడి వుంది. ఈ క్రమంలో ఆధునిక విజ్ఞాన ఫలితాల్ని, ప్రకృతి సహజ సూత్రాల్ని సమన్వయం చేసుకోవడం అవసరం.

జీవితానికి ఒక లక్ష్యం ఉండాలని, జీవించడానికి ఒక ఉద్దేశం ఉండాలని తలపోయడం సహజం. కానీ ఏ ఉద్దేశాలు, లక్ష్యాలు లేకుండానే బతకడం కోసం బతక్క, బతుకు బండిని లాగక తప్పని మనుషులే మన చుట్టూరా ఎక్కువ. అసలు ఉనికిలో ఉండటమే పెద్ద సమస్య కావడమే దీనికి మూలం. ముందుగా బతకాలి. బతకడానికి కనీస సౌకర్యాలుండాలి. తిండి, బట్ట, గూడు అనేవి ప్రాథమికావసరాలు. ఈ అవసరాలు తీర్చుకోవడంలోనే సామాన్యుల బతుకులు ఏళ్ళకేళ్ళు గడిచిపోతుంటాయి. ఈ పరిస్థితులలో వారు జీవిత లక్ష్యాలు, ఎదుగుదలకు మైలురాళ్ళు ముందు పెట్టుకోవడం సాధ్యం కాదు. ఈరోజు గడిస్తే చాలు, లేదంటే రేపు గడిచేదెలా అన్న చింతలోనే కాలం వెళ్ళబుచ్చక తప్పని పరిస్థితుల్లో ఉన్నవారికి జీవన సారాంశం అంటే ఏమిటో అంతుబట్టదు.

అయితే తమకు తెలియకుండానే తమ జీవితాన్ని, తమ చుట్టూ ఉండేవారి జీవితాన్ని మెరుగు పరుచుకోడం కోసం శ్రమిస్తారు, పోరాడుతారు. ఉద్యమపథంలోకి వెళతారు. ఇది అసంకల్పితంగా జరిగే చర్య. ఆ క్రమంలో వారికి తెలియకనే లక్ష్యాలు రూపొందుతాయి. పరుల కోసం బతకడం అలవడుతుంది. తెలియకనే తమ బతుక్కి ఉద్దేశాలు, లక్ష్యాలు చేకూరుతాయి. వీటికి అనుగుణంగా జీవించడం సహజాతి సహజంగా అలవాటవుతుంది. ఇది తెలియకనే వారి జీవితానికి ఒక సారాంశాన్ని ఏర్పరుస్తుంది. ఆ సారాంశం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆదర్శప్రాయమైన జీవితంగా నిలబడుతుంది. ఇలాంటి వారి బతుకు సారాంశం ఇతరులకు స్ఫూర్తిదాయకమవుతుంది.

కనుకనే మహనీయుల అడుగుజాడల్లో నడవాలని చెబుతారు. వారి నిజాయితీ, నిర్భీతి, కార్యదీక్ష, పట్టుదల పథనిర్దేశం చేయాలని ఆశిస్తారు. తద్వారా జీవితానికి నిర్దిష్టమైన సారాంశం చేకూరుతుంది. అది బతుకును వెలిగిస్తుంది. మానవ జీవితాన్ని ప్రదీప్తం చేస్తుంది.

వెంటాడే వాక్యం

"మనం మళ్ళీ మళ్ళీ చేసే పనే మనం, ఔన్నత్యం అంటే ఒక చర్య కాదు, ఒక అలవాటు".

– అరిస్టాటిల్

ప్రజాశక్తి

సోపతి

మార్చి 15, 2015

లేఖలు	4
సంగీతం	
అలరించే జానపద బాణీలు	5
కవర్‌స్టోరీ	
అనువాదం ఓ సృజనోత్సవం	6
భాషలో సారళ్యం - అనువాదానికి ఆకర్షణ	8
కథ	
పనిమనిషితో దండం	10
జోక్స్ కార్నర్	13
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
సృజన	
ఏకాంతవాసం ఆమె కవిత్వానికి ప్రేరణ	18
స్మృతి పథంలో...	
పీసు మామిడి చెట్టు	20
ఇంటర్వ్యూ	
కవిత్వానికి కొత్త శోభ	22
సోర్స్‌కోడ్	
యాపిల్ 'స్మార్ట్ వాచ్' వచ్చేసింది!	23
సమీక్షలు	
ప్రగతిశీల కవిత్వం	24
ఈ వారం కవిత్వం	
పదమూడు గీతల, యాభై చుక్కల ముగ్గు	26



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మంచి సాహిత్యాన్ని చదివినప్పుడే అనేక సమాజాల పోకడ తెలుస్తుంది. ఫలితంగా మానవుల్లో ఉన్న ఏక రూపకత, భిన్నత్వాల పట్ల అవగాహన వస్తుంది. ఈ అవగాహనకు అనువాద సాహిత్యం ఎంతో అవసరం. ఆ అనువాద సాహిత్య విశేషాలే ఈవారం కవర్ స్టోరీ...

లేఖలు



మంచి సలహా

సార్ నేను వ్యవసాయం చేస్తాను. మీరు రాసిన 'ఆహారమే ఉద్దీపన' వ్యాసం బాగుంది. నేను తరచుగా ఏమయితే తింటానో వాటినే మీరూ తినమని సలహా ఇవ్వటం నచ్చింది. నేను రాత్రిపూట అన్నం తినను. అరటిపళ్ళు లాంటి పండ్లు తింటాను. అందుకే నేమో నాకు ఇప్పటివరకు ఎటువంటి జబ్బు రాలేదు.

-మల్లయ్య, ఖాజీపేట్

ఇవే ఉదాహరణలు

పుస్తక సమీక్షలు నచ్చాయి. ఏదో ముందు మాట చూసి సమీక్ష రాసినట్లు కాక, కాస్త శ్రద్ధగా చదివి రాస్తే ఎలా ఉంటాయో చెప్పటానికి మీరిచ్చిన సమీక్షలు ఉదాహరణలుగా నిలుస్తాయి.

- ప్రసాదరావు, సూర్యాపేట

వినోదం, విజ్ఞానం

మీరిస్తున్న 'నెమలీక' పేజి చాలా బాగుంటోంది. తేడాలు అని రెండు బొమ్మలకు ఉన్న సున్నితమైన తేడాను గుర్తించమని అడగటం చాలా బాగుంది. ఇప్పటికే పోటీ పరీక్షలకు ఇటువంటి చిత్రాలను ఇచ్చి అభ్యర్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. నెమలీకలో ఇలాంటివి ఇవ్వటం వల్ల పిల్లలకు వినోదాన్ని పంచటంతోపాటు ముందు ముందు వారిని పోటీ పరీక్షలకు తయారు చేసినట్లు ఉంటుంది.

- వినోద్, మహబూబ్‌నగర్

విశ్లేషణ బాగుంది

పిఠాపురం నాగేశ్వరరావు పాటల గురించిన సమాచారం బాగుంది. గోలీ సోడా పాట గురించి విశ్లేషిస్తూ రాసిన మాటలు అక్షరసత్యాలు. పాటలను ఇలా కూడా విశ్లేషించవచ్చా అనిపించింది.

-గురు, హైదరాబాదు

సమాచారం చాలావుంది

ఈ వారం కవర్ స్టోరీ 'ఆహారమే ఉద్దీపన' ఎన్నో విషయాలను చెప్పింది. ఆహారం మనుషుల మూడ్‌ని ఎలా మారుస్తుందో ఉదాహరణ సహితంగా చెప్పటం బాగుంది. నాదగ్గర న్యూట్రిషన్ ఫుడ్‌కు సంబంధించిన సమాచారం చాలా ఉంది. కావాలంటే మీకు అందిస్తాను.

- రాంబాబు, ఖమ్మం జిల్లా మలేరియా ఆఫీసర్

పాత జ్ఞాపకం

ఆహారమే ఉద్దీపన అనే కవర్ స్టోరీ గొప్పగా లేకపోయినా సరళంగా ఉంది. అయితే కవర్‌స్టోరీ చదివిన తరువాత నాకొక జరిగిన సంఘటన గుర్తుకొస్తోంది ఒక ఇరవై ఏళ్ల నాటి మాట! మా ఊళ్లో పొలంపని చేసుకుని బతికే ఓ కుర్రాడికి పెళ్లయింది. పెళ్ళియిన మరుసటి రోజే అత్తగారింటికి వెళ్ళాడు. రాత్రికి అత్తగారు సన్నబియ్యం కూడు, వేపుళ్లు, స్వీట్స్‌తో రుచికరమైన భోజనం పెట్టింది. ఆ పెళ్ళికొడుకు కడుపునిండా లాగించేసి పడక గది చేరుకున్నాడు. నవ వధువుకోసం ఎదురుచూస్తూ వెంటనే నిద్రలోకి జారుకున్నాడు. ఇంతలో సిగ్గుపడుతూ పాల గ్లాసుతో గదిలోకి అడుగుపెట్టిన కొత్తపెళ్ళికూతురు గురకపెట్టి నిద్రపోతున్న భర్తను చూసి ఆశ్చర్యపోయింది. ఏం చేయాలో తెలియక కిందే కూలబడి తన కర్మ ఇలా కాలిపోయిందేమిటిరా భగవంతుడా అని ఏడుస్తూ ఉండిపోయింది. సీన్ కట్ చేస్తే... తెల్లవారిన తరువాత పెళ్లికూతురు తరపువారు పెద్దమనుషుల పంచాయితీ పెట్టారు. పెళ్లికొడుకు సంసారానికి పనికిరాడని, మోసం చేసి పెళ్ళిచేసుకున్నాడని ఇందుకు నష్టపరిహారం చెల్లించి విడాకులు ఇవ్వాలని పెద్దమనుషులు తీర్మానించారు. పెళ్ళికొడుకు జరుగుతున్న వ్యవహారం చూసి బిత్తరపోయాడు. రాత్రి భోజనం చేసిన తరువాత మత్తు ఆవహించి తెలియకుండానే నిద్రలోకి జారుకున్నానని అందువల్ల తన భార్యను గమనించలేకపోయానని తన తప్పును క్షమించమని వేడుకున్నాడు. పెద్దమనుషులు పెద్దమనసుతో అతగాడికి మరో అవకాశం ఇవ్వటంతో కథ సుఖాంతమయింది. మీ కవర్ స్టోరీ చూసిన తరువాత ఆ నాడు ఆ పెళ్ళి కొడుకు వెంటనే ఎందుకు నిద్రపోయాడో అర్థమయింది. ఆనాడు అత్తగారు వడ్డించిన ఆహారంలో కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే అన్నం, వేపుళ్ళు, స్వీట్స్ ఉన్నాయి. అందుకనే అతగాడు గమ్మత్తుగా నిద్రలోకి జారుకున్నాడని ఇప్పుడు అర్థమయింది. థాంక్స్ టు ప్రజాశక్తి.

- పుష్పమాల, కరీంనగర్

మన జాతీయాలు

చెయ్యాడుట

ఈ చేయి ఆడితే ఆ చేయి ఆడుతుంది. అంటే నీవిస్తే నేనిస్తా. డబ్బు దగ్గర లేదు. ఏదైనా చేతితోనే యిస్తాం. కాబట్టి డబ్బే లేకపోతే చేతితో చేసే పని వుండదు. చేతితో యిచ్చేంత డబ్బు లేకపోవుట చెయ్యాడకుండుట. చెయ్యాడుట అంటె డబ్బు చేయికి అంది యిచ్చి పుచ్చుకాలు నడుస్తున్నాయన్న మాట.

బుట్టలో పాము

బుట్టలో పాము వుండవచ్చు లేకపోవచ్చు. ఉంటే మాత్రం అపాయకరమైందే. అటుకు మీద పాము కలలో, మెళకువలో చంపుతుందో లేదో, దిగి వస్తుందో రాదో కాని రోజూ చావు భయాన్ని కల్పిస్తుంది. పాములవాడు పట్టి తెచ్చి బుట్టలో పెట్టిన కోరలు పీకిన పాము పుంగీ ఊదితే లేచి ఆడుతుంది. మూత బెడితే బుట్టలో ఇమిడిపోతుంది. పాములవాని చెప్పుచేతుల్లో వుంటుంది. ఆకారం భయంకరం, అపాయం లేదు. గొప్పవారి చెప్పుచేతుల్లో వుండి ఇతరులను బెదిరించటానికి పనికి వచ్చేది మాత్రమే. "పాములవాడు మూత తీసి పుంగీ పడితేనే పడగెత్తి బుసలు కొడుతుంది. అలాగే దొర ఉసికొల్పితే మందిని బెదిరించ చూస్తాడు. వాడు బుట్టలో పాము తీరు దొర చెప్పినట్లు చేస్తడు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం.

బుడుబుంగ

నీటిలో తిరిగే పక్షి. బాతు జాతికి చెందినది. నల్లగా వుంటుంది. ఒకచోట బుడుక్కున మునుగుతుంది. కూతపెట్టు దూరంలో తేలుతుంది. మళ్లీ మునిగితే అలాగే చేస్తుంది. లోపల చేపలను వేటాడుతుంది. ఇప్పుడీ ఇంట్లో, వెంటనే మరొకరింట్లో కాలాగకుండా ఎక్కడా కూడా నిలకడ లేకుండా తిరిగేవారిని బుడుబుంగ అంటారు.

- వేముల పెరుమాళ్ళు

■ సంగీతం

అలరించే జానపద బాణీలు

ఇంపైన సంగీతంతో పల్లె పదాల సాహిత్యంతో సమకాలీనతని తెలిపే పాటలే జానపదాలు. వీటిలో ఉండే విశేషం ఏంటంటే సరదాగా ఉంటూనే అంతర్లీనంగా ఏదో ఒక నీతిని బోధించడమో, లేదా ఒక సమస్యని తీసుకుని అందరికీ విషయాన్ని తెలిపేలా ఉంటాయి జానపదాలు. అది సమస్య అయినా, సంతోషమైనా, విషాదమైనా, మరేదైనా కానీ... ఎవ్వరినైనా సరే ఆకట్టుకునే బాణీలు సాహిత్యం వీటి సొంతం. అంతేకాదు వీటిలో ఒకరినొకరు ఆటపట్టించుకునేవి, అభిమానాన్ని తెలుపుకునేవి, అనురాగాన్ని పంచే పాటలు ఎన్నో వున్నాయి. ఇప్పటి సినిమాల్లో జానపదాలకు స్థానం లేదు కానీ బ్లాక్ అండ్ వైట్ చిత్రాల్లో స్టేజ్ మీద నాయికీ నాయకులకు గానీ, హాస్యనటులకు గానీ, లేదా గ్రూప్ డాన్సర్ల పై గానీ దాదాపు ప్రతి చిత్రంలో ఏదో ఒక సందర్భంలో ఈ జానపద పాటలను పెట్టేవారు. అవి సంగీత పరంగా, సాహిత్య పరంగా ఎంతో హుందాగా ఉండటమే కాదు, అర్థవంతంగా వుండేవి. ఇప్పటి సినిమాల్లో ఆ జానపదాల స్థానంలో ఐటమ్ సాంగ్స్ వచ్చేశాయి. అలనాటి సినీ జానపద గీతాలు కొన్ని...

సినిమాల్లో జానపద గీతం అంటే ముందుగా గుర్తొచ్చేది ఏరువాక సాగారో అనే గీతం. అందరికీ అన్నదాత అయిన రైతు కష్టాన్ని, అతను చేసే సేవను మెచ్చుకుంటూ పాడే పాట 'రోజులు మారాయి' చిత్రంలో కొసరాజు సాహిత్యం అందించిన "కల్లాకపటం కానని వాడా, లోకంపోకడ తెలియని వాడా, ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా, నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా.." సాహిత్య పరంగానే కాదు సంగీత పరంగా కూడా మాస్టర్ వేణు అందించిన బాణీలు బాగా పాపులర్ అయ్యాయి. ఈ పాటలో నటించిన వహీదా రెహమాన్‌కు ఇదే తెలుగులో మొదటి సినిమా. ఈ పాటను జిక్కి పాడారు. ఇదే సినిమాలో "ఒలియో ఒలి ఒలియో ఒలి" అనే మరో జానపద గీతం కూడా ఉంది.

జానపదాల ముఖ్య ఉద్దేశం పగలనక రేయనకా పనిలోని శ్రమనంతా ఆటపాటలతో మర్చిపోడానికే. ఇదే అర్థంతో 'వెలుగు నీడలు' చిత్రంలో శ్రీశ్రీ రాసిన "ఓ రంగయో పూల రంగయో, ఓరచూపు చాలించి సాగిపోవయో, పొద్దువాలిపోతున్నదోయి.. ఇంత మొద్దు నడక నీకెందుకోయి..". పెండ్యాల నాగేశ్వరరావు సంగీత సారథ్యంలో ఘంటసాల, పి.సుశీల ఈ పాటను పాడారు. సాయం సమయంలో పని ముగించుకున్న పల్లె పడుచులు హుషారుకోసం పాడుకునే పాట ఇది.

బస్తీకి వెళ్ళి తేలికగా సొమ్ములు సంపాదించుకోవచ్చు అనుకుని భ్రమపడే కుర్రకారును హెచ్చరిస్తూ పట్నం మోజులో పడి పల్లెల్ని వదిలి వెళ్ళొద్దనే సందేశంతో వచ్చిన పాట 'తోడికోడళ్ళు' చిత్రంలో "టౌనుపక్కకెళ్ళద్దురా డింగరి" అనే జానపదం. కొసరాజు రాఘవయ్య చౌదరి సాహిత్యాన్ని మాస్టర్ వేణు సంగీతంలో ఘంటసాల, జిక్కి పాడారు.

యువతీయువకుల్లో తమకు రాబోయే భార్య/భర్త గురించి కొన్ని ఊహలుంటాయి. దాన్ని జానపదా బాణీలో ఎంతో అందంగా మలిచిన గీతం 'మూగమనసులు' చిత్రంలో "గౌరమ్మా నీ మొగుడెవరమ్మా... ఎవరమ్మా వాడెవరమ్మా", అమ్మాయి సిగ్గుపడుతూనే తనకు కాబోయే వరుడి రూపురేఖలు, లక్షణాలను వివరిస్తుంటే అబ్బాయేమో దానికి కౌంటర్ వేసిన ఈ పాట ఇప్పటికీ వినసొంపుగానే వుంటుంది. ఇదే చిత్రంలో మరో జానపదం "గోదారి గట్టుంది, గట్టుమీద సెట్టుంది, సెట్టు కొమ్మన పిట్టుంది పిట్ట మనసులో ఏముంది... ఓ..ఓ.. హోయ్".

'మంచి మనసులు' చిత్రంలో కొసరాజు రాసిన సాహిత్యాన్ని జమునారాణి, ఘంటసాల పాడిన జానపదం "మావ మావ మావ.. ఏమే ఏమే భామా పట్టుకుంటే కందిపోవు పండువంటి చిన్నదుంటే చుట్టుచుట్టు తిరుగుతారు మరియాద". దీనికి సంగీతం కె.వి.మహదేవన్. నేటి యువత మెచ్చేది, కచ్చితంగా వినాల్సిన పాట కూడా.

'చెంచులక్ష్మి' చిత్రంలోని నాయికీ నాయకులు ఒకరికొకరు సవాల్ విసురుకున్నట్లుండే పాట "చెట్టులెక్కగలవా ఓ నరహరి పుట్టలెక్కగలవా? చెట్టులెక్కి ఆ చిటారు కొమ్మల చిగురు కోయగలవా?" జిక్కి, ఘంటసాల పాడిన ఈ పాటకు సంగీతం ఎస్.రాజేశ్వరరావు, రచన ఆరుద్ర.

'బంగారు తిమ్మరాజు' చిత్రం మంచి హుషారును తెప్పించే పాట జమునారాణి పాడిన "నాగమల్లి కోనలోన నచ్చింది లేడికూన ఎర వేసి గురి చూసి పట్టాలి మావా" పాట. ఇందులో "ఎర వేసి.. అహ గురి చూసి.. అహ పట్టాలి మావా.." అనే పదాలను జమునారాణి పలికే తీరు ఆకట్టుకుంటుంది. అదృష్టవంతులు' చిత్రంలో బాగా ప్రాచుర్యం పొందిన షుషారైన పాట "మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో మంచె కాడ కలుసుకో మరువకు మావయ్య".

జానపద గీతాల్లో భాగమే ఎంకి పాటలు కూడా. ఎంకి మీద లలిత గీతాలే కాదు సినిమాల్లోనూ మంచి మంచి పాటలు వున్నాయి. 'దాగుడుమూతలు' చిత్రంలో బి.సరోజాదేవి మీద చిత్రించిన "ఎంకొచ్చిందోయ్ మావా ఎదురొచ్చిందోయ్ ఎదురొచ్చి నీ కోసం ఏదో తెచ్చిందోయ్", 'నాకూ స్వాతంత్ర్యం వచ్చింది' చిత్రంలో "ఎంకీ నే సూడలేనే ఎలుతురులో నీ రూపు ఎలిగిపోతుంటే" అనే పాటలు బాగుంటాయి.

'కలసి ఉంటే కలదు సుఖం' లో "ముద్దబంతి పూపెట్టి మొగలి రేకుల జడను చుట్టి", 'బంగారు పంజరం' చిత్రంలో దేవులపల్లి రాసిన "గట్టుకాడ ఎవరో" చెట్టునీడ ఎవరో, నల్ల కనుల నాగసొరము.. ఊదేరు ఎవరో", రాజమకుటంలో "ఏడనున్నాడో ఎక్కడున్నాడో నా చుక్కల రేడు", 'అమాయకుడు' చిత్రంలో "పట్నంలో సాలిబండ పేరైనా గోలకొండ, చూపించు సూపునిండా", 'భీష్మ' చిత్రంలో "హైలో హైలెస్సా హంస కదా నా పడవ" వంటి పాటలన్నీ జానపద సొబగులతో అలరించినవే. పాశ్చాత్య సంగీత హోరులో అర్థం కాని సాహిత్యంతో వచ్చే పాటలకంటే నేటి సినిమాల్లో కూడా ఒక్క పాటైనా ఇలాంటి వినసొంపైన జానపద బాణీలను చేర్చితే బావుంటుంది కదూ!

- బి.మల్లేశ్వరి

ఆదాన ప్రదానాలు భావాల వ్యాప్తికి అవసరం. సాహిత్యంలోని మేలిమిని విభిన్న భాషల పాఠక సమూహాలకి అందించడానికి తప్పనిసరి. ఇందుకు అనువాదమే వాహిక. సాహిత్యమే కాదు సాహిత్యేతర అంశాలు కూడా ఒక భాష నుంచి మరో భాషలోకి వెళ్ళడం ద్వారానే భావ వినిమయం సాధ్యం. కమ్యూనిస్టు ప్రణాళిక అనేకానేక భాషల్లోకి అనువాదం కావడం వల్లనే సమసమాజ స్వప్న సాకారం సాధ్యమని ప్రపంచం విశ్వసించింది. దోపిడీ పీడనల్లేని సామ్యవాద వ్యవస్థ స్థాపనకు అనువైన ఏకైక సిద్ధాంతం మార్క్సిజం. మార్క్స్, ఎంగెల్స్ రచనల అనువాదాల కారణంగానే ఆ సిద్ధాంతపు బలం లోకానికి తెలిసి వచ్చింది. అలాగే రామాయణం, మహాభారతం అనేకానేక భాషల్లోకి అనువాదం కావడం ద్వారానే ఈ దేశంలోని ఇతిహాసాల మూలాలు విశ్వవ్యాప్తమయ్యాయి.

అనువాదం ఓ సృజనోత్సవం

ఒక భాష నుంచి మరో భాషలోకి వెళ్ళే సాహిత్యానువాదాలు ఉదాత్త భావాల వ్యాప్తికి తోడ్పడతాయి. ముఖ్యంగా ఉత్తమ సాహిత్యం అనువాదం కావడం వల్ల హృదయ సంస్కారం నెలకొంటుంది. మానవీయ దృక్పథం పాదుకుంటుంది. ఇతరులకు వీలయినంత ఎక్కువ మేలు తక్కువ హాని జరిగేలా తమ నడత ఉండాలన్న అభిప్రాయాలకు బలం చేకూరుతుంది. ఈ కారణంగానే అనువాదాలకు ప్రాశస్త్యం చేకూరింది.

మాక్సీమ్ గోర్కీ 'అమ్మ' నవల చదివి మార్క్సిజానికి ఆకర్షితులైనవారు ఉన్నారు. రవీంద్రుని 'గీతాంజలి' చదివి ఉత్తేజితులయినవారున్నారు. బెంగాలీ సాహిత్యానువాదాలు చదివి శరత్, ప్రేమ్‌చంద్‌ల సాహిత్యానికి ముగ్ధులయినవారు అనేకులు. తద్వారా ప్రజల మేలును తలపోసే అభ్యుదయోద్యమాల పథం తొక్కిన సృజనశీలురు ఎందరో! కనుకనే అనువాదాలు చేసే మేలు అనంతం. తెలుగు సాహిత్య వికాసంలో, విభిన్న ప్రక్రియల విస్తరణలో అనువాదానికి తగినంత ప్రాధాన్యం వుంది. అందువల్లనే కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాదాలకు కూడా పురస్కారాలు అందిస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పుడు కేంద్ర సాహిత్య అకాడమీ వారి అనువాద పురస్కారాన్ని ఆర్.శాంతసుందరి గారు అనువాదం చేసిన 'ఇంట్లో ప్రేమ్‌చంద్'కు ప్రకటించారు. ప్రేమ్‌చంద్ గురించి ఆయన భార్య రాసిన పుస్తకమిది. అభ్యుదయ సాహిత్యవేత్తగా ప్రేమ్‌చంద్ ప్రఖ్యాతి చెందారు. గోదాన్, రంగభూమి వంటి గొప్ప నవలలు రచించారు. అలాంటి వ్యక్తి జీవితం మీద వచ్చిన విశిష్ట రచన ఈ పుస్తకం.

మాటకీ చేతకీ అంతరం లేకుండా జీవించిన సాహితీవేత్తల రచనలకి విశ్వసనీయత, సాధికారత ఉంటాయి. ఈ కారణంగానే ప్రేమ్‌చంద్ మీద వచ్చిన ఈ పుస్తకం సృజనశీలురకు ఓ పాఠ్యగ్రంథం. సామాన్యులకు సైతం ఉపయోగకరమైన పుస్తకం. తెలుగు నుంచి ఇతర భాషలకీ ఇతర భాషల నుంచి తెలుగులోకీ అనేక రచనల్ని సరళ సుందరమైన అనువాదంతో అందించిన శాంతసుందరి గారికి ఈ అవార్డు ఆలస్యంగా లభించింది. గతంలో ఆమె అనువాదం చేసిన 'బేబీ హాల్దార్'కే ఈ పురస్కారం రావాల్సి వుండింది. ఎట్టకేలకు ఇప్పుడయినా ఆమెకు ఈ అనువాద పురస్కారం లభించడం తెలుగునాట అనువాద ప్రపంచానికి ఒక ఉత్సవ సందర్భం. అనువాద సాహిత్యాన్ని ఇష్టపడే పాఠకులకు ఆనంద సన్నివేశం.

బెంగాలీల సాహిత్యంపై మమకారం హిందీ తర్వాత బెంగాలీ నుంచే ఎక్కువగా తెలుగులోకి అనువాదాలు వచ్చాయి. ముఖ్యంగా 1950, 60లకి పూర్వం బెంగాలీ సాహిత్యం విపరీతంగా అనువాదమైంది. బంకించంద్ర, రవీంద్రనాథ్ టాగూర్, శరత్, కిషన్‌చందర్, ప్రేమ్‌చంద్, తారాశంకర్ బెనర్జీ మొదలయినవారి రచనలు విస్తారంగా తెలుగులోకి అనువాదం చేశారు. శరత్ సాహిత్యం సమస్తం తెలుగులోకి వచ్చింది. శరత్ నవలలు గొప్ప భావ విప్లవాన్ని తీసుకొచ్చాయి. సాహిత్యం మీద పాఠకుల మమకారాన్ని ఇనుమడింపజేశాయి. శరత్ జీవితచరిత్రకు జ్వాలాముఖి చేసిన అనువాదం రమణీయమైంది. బెంగాలీ సాహితీవేత్తల్లో శరత్ అంత దగ్గరగా మన ఆత్మకు సన్నిహితంగా వచ్చినవారు అరుదు. నవలా సాహిత్యం మీద తెలుగు పాఠకుల్లో ఆసక్తినీ, అనురక్తినీ పెంచడానికి శరత్ సాహిత్యం దోహదం చేసింది. తర్వాత కాలాన సునీల్ గంగోపాధ్యాయ, మహాశ్వేతాదేవి వంటివారు ఈతరం పాఠకులకు దగ్గరగా వచ్చినప్పటికీ శరత్ సాహిత్యం ఎప్పటికీ సమ్మోహన భరితం. ఇక రవీంద్రుని గీతాంజలిని తెలుగులో అనేకులు అనువాదం చేశారు. అందులో బెల్లంకొండ రామదాసు, చలం చేసిన అనువాదాలు అపురూపమైనవి. మరల మరల గీతాంజలిని చదవాలనిపించే అనువాదాలవి.

రష్యన్ అనువాదాలు గొప్ప స్ఫూర్తి కొన్ని తరాల పాటు తెలుగులో పాఠకుల సంఖ్యను పెంచడానికి సోవియట్ సాహిత్య అనువాదాలు తోడ్పడ్డాయి. అలాగే కమ్యూనిస్టు ఉద్యమాల్లోకి వేలు, లక్షలుగా జనాలు తరలి రావడానికి ప్రేరణగా నిలిచిందీ సాహిత్యం. తెలుగు సాహిత్యంలో ఇవాళ లబ్ధప్రతిష్టులయిన అనేకమంది కవులకీ, రచయితలకీ కూడా సోవియట్ సాహిత్యమే గొప్ప స్ఫూర్తి. గోర్కీ, పుష్కిన్, దొస్తవిస్కీ, లెర్మంతోవ్, టాల్‌స్టాయ్, చెంఘిజ్ అయిత్మతోవ్ వంటి రచయితల అనువాదాలు తెలుగు సాహిత్యం మీద చూపిన ప్రభావం అనంతం. రచయితలు ప్రజలవైపా? పాలకుల వైపా? అనే ప్రశ్నలు లేవనెత్తి కలంవీరులు ప్రజల పక్షం నిలవాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది సోవియట్ సాహిత్యం. ప్రత్యేకించి గోర్కీ రచనల సంపుటాల్ని ఇప్పుడు తాజాగా ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించింది. గోర్కీ నా బాల్యం, నా విశ్వవిద్యాలయాలు తప్పక చదవాల్సిన పుస్తకాలు.

సోవియట్ రష్యా తర్వాత చైనీస్ సాహిత్య అనువాదాలు ఉత్తేజపూరితమైన వాతావరణాన్ని ప్రోదిచేశాయి. 'చైనాపై అరుణతార' గ్రంథం చదవడం ఆ రోజుల్లో ఓ విశిష్ట అనుభవం. లూసన్, టావ్‌చెంగ్ రచనలు పాఠకలోకాన్ని ఉత్తేజితుల్ని చేశాయి. చైనీస్ సాహిత్యం కూడా తెలుగు పాఠక హృదయానికి దగ్గరగా వచ్చింది. ఆ తర్వాత ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ సాహిత్య అనువాదాల్ని ఆత్మీయంగా స్వీకరించారు. ఈ దేశ, ఈ ప్రాంత వాస్తవికతకు దగ్గరగా ఉండడమే దీనికి మూలం. గూగీ, చినువా అచెబి, టోనీ మారిసన్ రచనలు ఇందుకే నచ్చుతాయి. ఆంగ్ల భాష నుంచి వచ్చిన అనువాదాలు

అవసరార్థం చదువుతారు. కానీ ఆత్మను ప్రదీప్తం చేసే అంశ అందులో తక్కువ. మరల ఫ్రెంచి సాహిత్యానికి సంబంధించి వస్తే రొమాంటిక్ ధోరణి ఓ ఆకర్షణీయ అంశం. అందుకే మపాసా రచనల్ని ఇష్టపడతారు. అధివాస్తవిక ధోరణిలోని జేమ్స్‌జాయిస్, వర్జీనియా వుల్ఫ్ రచనలపై ఆసక్తి చూపుతారు. అలాగే కాఫ్కా, అల్బర్ట్ కామూ వంటి రచయితలు కూడా మనవాళ్ళకు ఇష్టం. ఈ ఇద్దరి రచనల్ని ప్రముఖ కథారచయిత్రి జి.లక్ష్మి తెలుగులోకి అనువాదం చేశారు. అల్బర్ట్ కామూ 'ఔట్ సైడర్' నవలకు ఆమె చేసిన అనువాదంలో చదివించే గుణం ఉంది.

భారతీయభాషల్లో... భారతీయ భాషల్లోంచి తెలుగులోకి అనువాదాలు ఎక్కువగానే వస్తున్నాయి. ఒక ప్రాంతీయ భాషలోంచి హిందీలోకి అనువాదమైతే తద్వారా ఇతర ప్రాంతీయ భాషల్లోకి అనువాదం కావడం సులువు. ఒక ప్రాంతీయ భాషలోంచి ఇంగ్లీషులోకి అనువాదమయిన రచనని అనువాదం చేయడం కన్నా హిందీలోకి అనువాదమైన రచన అనువాదం చేయడం సులభం. సంస్కృతం మిళితమైన హిందీభాషలోని నుడికారం వల్ల అనువాదం సాధికారికంగా, మూలానికి దగ్గరగా ఉండే అవకాశం ఉంది. కనుక ప్రాంతీయభాషలు తెలిసిన వారికి హిందీ భాషపై సాధికారికమైన పట్టు ఉన్నప్పుడు అనువాదం మరింత సృజనాత్మకంగా రూపొందుతుంది. శాంత సుందరి, ఎం.రంగయ్య, పోలి విజయరాఘవరెడ్డి వంటి వారి రచనల్లోని మేలిమికి మూలం హిందీ, తెలుగుభాషలపై వారికి మంచి పట్టు ఉండటం.

అయితే తమిళం, మలయాళం, కన్నడం నుంచి నేరుగా అనువాదాలు చేయగల ప్రతిభాశాలురు అనేకులున్నారు. యు.ఆర్.అనంతమూర్తి 'సంస్కార' నవలను సుజాతా పట్వారి కన్నడం నుంచి నేరుగా తెలుగులోకి అనువాదం చేశారు. సేతు నవల 'పాండవపురం'ను మలయాళం నుంచి తెలుగులోకి ఎల్.ఆర్.స్వామి చక్కగా అనువదించారు.

సాహిత్యేతర అనువాదాలు అధికం ఇవాళ వస్తున్న అనువాదాలతో పోల్చుకుంటే 1960ల పూర్వం అనువాదాలు ఎక్కువని చెబుతుంటారు సీనియర్ రచయితలు, ప్రచురణకర్తలు. ఆ రోజుల్లో పాఠకుల మానసిక ప్రపంచాన్ని విశాలం చేసే అనువాదాలు ఎక్కువ. వైయుక్తిక స్వప్నాల కన్నా సామూహిక స్వప్నాల మీదనే దృష్టి కేంద్రీకృతమైన కాలమది. కానీ కాలం మారుతూ వచ్చింది. 1980ల తర్వాత... ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 1990ల కాలం నాటికి వ్యక్తి కేంద్రంగా ఆలోచనలు ప్రబలాయి. పదుగురి మేలు కన్నా తన ప్రయోజనమే మిన్న అనే భావాలు పొడసూపాయి. దీనితో వ్యక్తిత్వ వికాసం పేరిట వచ్చే రచనలకీ, అనువాదాలకీ ప్రాధాన్యం హెచ్చింది. ఈ ధోరణి 2000 సంవత్సరం తర్వాత పరాకాష్టకు చేరింది. అందువల్లనే 1990ల వరకు ఫుట్‌పాత్‌లకే పరిమితమైన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పుస్తకాలు యువత చదవాల్సిన గ్రంథాలుగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇక్కడి వ్యక్తిత్వవికాస రచయితలు ఆ పుస్తకాల్ని అనుసరించి, కొన్నిసార్లు చౌర్యం చేసి పుస్తకాలు రాశారు. తర్వాత ఆయా రచయితల పుస్తకాల్ని నేరుగా అనువాదం చేసి మార్కెట్ చేసే ధోరణి ప్రబలింది. అందువల్లనే డేల్‌కార్నెగి, స్టీఫెన్ ఆర్. కవీ, దీపక్ చోప్రా, శివఖేరా, రాబర్ట్ కియోస్కి, రాబిన్‌శర్మ వంటి వారి పుస్తకాల అనువాదాలు కోకొల్లలుగా వచ్చాయి. భగవద్గీతలోనూ, మహాభారతంలోనూ వ్యక్తిత్వ వికాస కోణాల్ని చూస్తున్నారు. స్వామి వివేకానందని వ్యక్తిత్వవికాస నిపుణుడిగా మార్చివేశారు. మరోవైపున సెల్ఫ్‌హెల్ప్ పుస్తకాలు అనువాదమై వస్తున్నాయి. ఆరోగ్యంగా ఉండడం ఎలా? డబ్బు సంపాదించడం ఎలా? లావు తగ్గడం ఎలా? భద్రజీవితాన్ని సాధించడానికి యోగా, ధ్యానం వంటి ప్రక్రియలు ఎలా ఉపకరిస్తాయో చెప్పే రచనల అనువాదం అధికం. ఈరకమైన పుస్తకాల్ని అవసరమైన పుస్తకాలుగా తలపోసే పాఠకుల సంఖ్య ఇనుమడించింది. దీనికి అనువుగా ఇలాంటి పుస్తకాల అనువాదాల పరంపర కొనసాగుతోంది. సాహిత్యం ద్వారా వచ్చే హృదయ సంస్కారం కన్నా వ్యక్తిగా ఎదగడానికి తోడ్పడే పుస్తకాలకు ప్రాధాన్యం చేకూరింది. ఈ నేపథ్యంలోనే సాహిత్యేతర అనువాదాలకు మార్కెట్ పుష్కలంగా వుంది. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి నగరాలకు చెందిన ప్రచురణ సంస్థలు ఈవిధమైన పుస్తకాలని తెలుగులోకి అనువాదం చేయించి అమ్ముతున్నాయి. కనుక పుస్తకాల షాపుల్లో, బుక్ ఎగ్జిబిషన్లలో ఇలాంటి పుస్తకాల హల్‌చల్ చూస్తున్నాం.

జీవితచరిత్రలు, ఆత్మకథలు వ్యక్తిత్వవికాసం, స్వయం సహాయక పుస్తకాల తర్వాత జీవితచరిత్రల, ఆత్మకథల అనువాదాలు వస్తున్నాయి. కారల్ మార్క్స్, లెనిన్, ఎంగెల్స్, స్టాలిన్, మావో, చెగువేరా వంటి వారి జీవితచరిత్రలపై కొందరికి ఆసక్తి. ఇక ఇప్పుడు బిల్‌గేట్స్, అంబానీల జీవితచరిత్ర మీద ఆసక్తి చూపే ధోరణి పెరిగింది. సంపన్నులు ఎదిగిన వైనం స్ఫూర్తిదాయకమనే భావాలు పొడసూపాయి. అందువల్లనే సంపన్నుల విజయగాథలు పుస్తకాలు ఆంగ్లం నుంచి తెలుగులోకి వస్తున్నాయి. వీటితోపాటు ఐన్‌స్టీన్, చార్లెస్ డార్విన్, మేరీ క్యూరీ, నోబెల్ విజేతలు, మహిళల స్ఫూర్తిదాయక చరిత్రల అనువాదాలు అనేకం వస్తున్నాయి. తెలుగునాట వివిధ రంగాలకు చెందినవారి జీవితచరిత్రల కన్నా ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రముఖుల జీవితచరిత్రలు అనువాదమై వస్తున్నాయి.

అయితే అనువాదం కోసం అనువాదం కాకుండా ఇష్టంగా అనువాదం చేసేవారు అనేకమంది వున్నారు. ఇతరభాషల్లోని రచనల మీద ప్రేమతో అనువాదం చేసేవారు, బాధ్యతతో అనువాద కార్యక్రమాన్ని చేపట్టేవారు ఉన్నారు. ముక్తవరం పార్థసారథి అనువాదాలు చేయడమే కాదు, మంచి సాహిత్యాన్ని పరిచయం చేస్తున్నారు. కస్తూరి మురళీకృష్ణ క్లాసిక్స్ అనిపించిన అనేక పుస్తకాల్ని పరిచయం చేశారు. లంకా శివరామప్రసాద్ ఈమధ్యకాలంలో ప్రపంచ సాహిత్యాన్ని సీరిస్‌గా అనువాదం చేస్తున్నారు. లక్ష్మీరెడ్డి, నిర్మలానంద, నిఖిలేశ్వర్, దేవరాజు మహారాజు వంటి ప్రముఖులు అనువాదరంగంలో చేస్తున్న కృషి విశేషమైంది. అనువాదాల ద్వారా సాహిత్య చైతన్యం పరిఢవిల్లుతుంది. ఒక భాషలోని మంచి సాహిత్యం ఇతర భాషలవారికి లభిస్తుంది. అంతిమంగా సాహిత్య సుసంపన్నతకు అనువాద కార్యక్రమం తోడ్పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని చూసినప్పుడు అనువాదానికి తెలుగులో ఒక అకాడమీ అవసరం. నిజానికి ఇప్పుడు తెలుగునాట రెండు రాష్ట్రాలకు రెండు అనువాద అకాడమీలు ఉండటం అవసరం. ఈ దిశగా ప్రభుత్వాన్ని కదిలించే ప్రయత్నం చేయడానికి రచయితలు, రచయితల సంఘాలు ప్రయత్నించడం అవసరం. ఈ ఏడాది అనువాద పురస్కారాన్ని పొందిన ఆర్.శాంతసుందరి గారికి మరోసారి అభినందనలు.

– కిరణ్‌కుమార్

పాత్రికేయ అనుభవం ఉపయోగపడింది

ప్రపంచంలో వివిధ భాషల్లో వెలువడుతున్న ఉత్తమ సాహిత్యాన్ని పాఠకులకు అందించడానికి అనువాద సాహిత్యం ఉపయోగపడుతుంది. అనువాద సాహిత్యం ద్వారా భిన్న ప్రాంతాలకు చెందిన సంస్కృతులు, పద్ధతులు, జీవన విధానం గురించి తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. అందుకే అనువాద రచనలంటే నాకు మొదటినుంచి ఆసక్తి ఉండేది. స్పార్టకస్, చెంఘిజ్ ఖాన్ లాంటి నవలలు, రష్యన్ సాహిత్యం, ఆంగ్ల సాహిత్యం, శరత్, ప్రేమ్‌చంద్, టాగోర్ రచనలు మొదలైనవన్నీ అనువాద సాహిత్యంపై మరింత అభిమానాన్ని పెంచాయి. ఆల్బర్ట్ కామూ "ది స్ట్రేంజర్" చదివిన తరువాత దానిని తెలుగు పాఠకులకు పరిచయం చెయ్యాలనుకున్నాను. "అపరిచితుడు"గా తెలుగులోకి అనువాదం చేశాను. ఫ్రాంజ్ కాఫ్కా కథలని "కాఫ్కా కథలు" పేరిట తెలుగులోకి అనువదించాను. 2013 సంవత్సరపు నోబెల్ బహుమతి గ్రహీత ఆలిస్ మన్రో కథలను కూడా "ఆలిస్ మన్రో కథలు" గా అనువదించాను. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి దినపత్రికలలో జర్నలిస్టుగా పనిచేసిన అనుభవం ఈ అనువాదాలకు బాగా ఉపయోగపడింది.

– జి. లక్ష్మి

ప్రేమ్‌చంద్ రచనల ప్రత్యేకత మనకందరికీ తెలిసిందే. కాని వారి వ్యక్తిత్వం, ఇష్టాలు, మానవీయత గురించి మాత్రం ఆయన భార్యకు మాత్రమే తెలుసు. అలాంటి విషయాలను ఆయన సతీమణి శివరాణీదేవి 'ప్రేమ్‌చంద్ ఘర్ మే' పేరుతో హిందీలో పుస్తక రూపంలో అందరికీ పరిచయం చేశారు. కాని హిందీ రానివారికి ఆయన గురించి తెలుసుకునే అవకాశం కలగలేదు. అలాంటి అవకాశాన్ని శ్రీమతి ఆర్. శాంతసుందరి "ఇంట్లో ప్రేంచంద్" పేరుతో పుస్తకాన్ని అనువదించి ప్రజలకు అందించారు. ఈ పుస్తక అనువాదానికి గానూ 2014 కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు ఈమెను వరించింది. ప్రఖ్యాత రచయిత కొడవటిగంటి కుటుంబరావు కుమార్తె అయిన శాంతసుందరి గత నలభై సంవత్సరాలుగా అనువాదరంగంలో విశేషకృషి చేస్తూ హిందీ, తెలుగు, ఇంగ్లీషు, తమిళం భాషల్లోని కవిత్వం, నవల, కథ, నాటకం, వ్యాసాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు... ఇలా 68 సాహిత్య పుస్తకాలను అనువాదం చేశారు. అనువాద పురస్కారం వచ్చిన సందర్భంగా ఆమెతో సంభాషణ

భాషలో సారళ్యం - అనువాదానికి ఆకర్షణ

సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం వచ్చినందుకు ముందుగా కంగ్రాచ్యులేషన్స్ మేడమ్...

ధన్యవాదాలు...

'ఇంట్లో ప్రేమ్‌చంద్' పుస్తకాన్ని అనువదించాలని ఎందుకనిపించింది?

జనవరి 2009 నుంచి జూలై2012 వరకు భూమిక మాసపత్రికలో సీరియల్‌గా వచ్చింది. భూమికలో ప్రారంభమైన రెండుమూడు నెలల్లోనే వరవరరావు గారి లాంటి ప్రఖ్యాత కవులు ఫోన్ చేసి చాలా బాగుందని చెప్పారు. ఆ తర్వాత పాఠకుల నుంచి మంచి స్పందన రావడం వల్ల సీరియల్ అయిపోయాక భూమిక పత్రిక చదవని వాళ్ళు కూడా దీన్ని చదివితే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. అందుకే ఆ ప్రయత్నం చేశాను. 2012 సెప్టెంబర్‌లో "ఇంట్లో ప్రేమ్‌చంద్" పేరుతో పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వాళ్ళు ప్రచురించారు.

2012లో ముద్రించిన ఈ పుస్తకానికి ఇప్పుడు అంటే మూడేళ్ళ తర్వాత అవార్డు రావడం పట్ల మీ స్పందన?

పుస్తకం ముద్రించిన తర్వాత దాన్ని అందరూ చదవాలి. చదివాక అది అవార్డుకి అర్హమైందనీ, సూచించాలనీ అనిపించాలి. ఆ తర్వాత ప్రచురణ తేదీ, సంవత్సరం మొదలైనవి సంస్థ నియమాలకి అనుగుణంగా ఉండాలి. దానికి ఇంతమాత్రం వ్యవధి పడుతుంది కదా!

ఇంత అనుభవం ఉన్న మీకు అవార్డు చాలా ఆలస్యంగా వచ్చింది అనుకుంటున్నాం...దీనిపై మీ స్పందన?

అవార్డులు రావలసినప్పుడే వస్తాయి. వస్తే సంతోషమే కానీ రాకపోతే విచారించను. అవార్డుల కోసం ఆశించకుండా మంచి పుస్తకాలని అందించాలన్న కోరికా, అందించానన్న తృప్తీ నాకు ముఖ్యం. ఆ లక్ష్యం 99శాతం నెరవేరిందనే అనుకుంటున్నాను. (1శాతం మొహమాటానికి)

అనువాదాలు చేయాలనే ఆలోచన ఎలా వచ్చింది?

అనువాదాలు చేయాలనే ఆలోచన నాకు ఎలా వచ్చిందో చెప్పాలంటే దాదాపు40ఏళ్ళు వెనక్కి వెళ్ళాల్సి ఉంటుంది... నేను బిఏ(హిందీ) ఆఖరి సంవత్సరం చదువుతున్నప్పుడు హిందీ మాతృభాష కాని విద్యార్థుల కోసం ఒక పోటీ పరీక్ష మద్రాస్ విశ్వవిద్యాలయం 1966లో నిర్వహించింది. అందులో నాకు మొదటి బహుమతి వచ్చింది. ఆ సందర్భంగా నాన్న గారితో కలిసి ఢిల్లీ, బెనారస్ వెళ్ళాను. మా నాన్న ప్రఖ్యాత రచయిత కాబట్టి ఆయన వల్ల హిందీ రచయితలని కలుసుకునే అవకాశం దొరికింది. దినకర్, జైనేంద్ర కుమార్, హరివంశరాయ్ బచ్చన్ లాంటి మహా మహులని కలిసి వాళ్ళ మాటలు వినే అరుదైన అవకాశం అంత చిన్న వయసులోనే దొరికింది.

మద్రాసు వచ్చాక అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ హిందీలో ఉత్తరాలు రాశాను. ఒక్క బచ్చన్ మాత్రమే జవాబు రాశారు. అందులో భారతీయ భాషల మధ్య పరస్పరం అనువాదాలు విరివిగా జరగడం ఎంత ముఖ్యమో చెబుతూ నన్ను ఆ పనికి పూనుకోమని, నా హిందీ చాలా బాగుందనీ రాశారు. ఆ ఉత్తరం ఇంకా భద్రంగా నా దగ్గర ఉంది. ఆ ఉత్తరం నాలో అనువాదాలు చెయ్యాలన్న ఆలోచననీ, ఆసక్తినీ రేకెత్తించింది.

మీదగ్గరికి వచ్చిన అన్నీ పుస్తకాలను అనువాదం చేస్తారా? లేదా మీకు నచ్చిన వాటినే చేస్తారా? అసలు అనువాదానికి పుస్తకాలను ఎలా ఎంపిక చేసుకుంటారు?

లేదు. నచ్చిన వాటినన్నీ కూడా అనువాదం చేయడం సాధ్యం కాదు. నాకు నచ్చడంతో పాటు పాఠకులకి కూడా నచ్చుతుందనీ, ఉపయోగంగా ఉంటుందనీ నాకు అనిపించినప్పుడే అనువాదానికి ఎంపిక చేసుకుంటాను.

అనువాదాన్ని యధాతథంగా చేస్తారా? లేదా స్వేచ్ఛానువాదం చేయడానికి ఇష్టపడతారా? ఎందుకు?

మక్కీకి మక్కీ అయితే మాత్రం నేను చెయ్యను. అలాగని పూర్తిగా మూలాన్ని పక్కన పెట్టడం కూడా సరికాదు. భావం, విషయం చెడకుండా మూలానికి వీలైనంత న్యాయం జరిగేలా చూస్తాను. భాష స్వభావాన్ని బట్టి చిన్న చిన్న మార్పులు చేర్పులు చెయ్యక తప్పదు. ఉదాహరణకి 'ఇంట్లో ప్రేమ్‌చంద్' కి హిందీ శీర్షిక 'ప్రేమ్‌చంద్ ఘర్ మే' దాన్ని యథాతథంగా అనువదిస్తే - 'ప్రేమ్‌చంద్ ఇంట్లో' అని వస్తుంది. కానీ తెలుగులో అర్థం ఎంత మారిపోతుందో చూడండి. ఇలాంటి వాటివల్ల అనువాదం అనువాదంలా ఉండకపోవడమే కాక దానికి స్పష్టత కూడా వస్తుంది.

మీకు కవిత్వ పుస్తకాలు అనువాదం చేయడం ఇష్టమా? లేక వచన రచనలా?

కవిత్వ మంటే ఎక్కువ ఇష్టం. కారణం చిన్నప్పట్నుంచీ ఆ వైపే మొగ్గు ఉండేది. కానీ ఒక విషయం చెపితే ఆశ్చర్యపోతారేమో, నేను ముందు అనువాదాలు మొదలుపెట్టింది కథలు, నాటికలతో. కవిత్వం అనువదించడం కష్టం అనుకునేదాన్ని. 1990 దశకంలో సాహిత్య అకాడమీ హిందీ పత్రిక ఎడిటర్ మీరు కవితలని ఎందుకు అనువదించకూడదు? ప్రయత్నించండి అన్నాడు. వెంటనే ప్రయత్నించి చూద్దామనుకున్నాను. ప్రఖ్యాత కవులవి ఏడు కవితలు అనువదించి పంపాను. ఒకటి తప్ప అన్నీ అచ్చయ్యాయి. అంతేకాదు, తరచూ తెలుగు కవితల అనువాదాలు పంపిస్తూ ఉండమని కోరాడాయన. ఇక ఆగకుండా కవిత్వానువాదం కూడా కొనసాగింది. నేను అనువదించిన పుస్తకాలన్నీ కాస్త స్థాయి ఉన్నవనే అనుకుంటున్నాను.

మీరు హిందీలో కూడా అనువాదం చేశారు. అనువాదాలు తెలుగులో ఎక్కువ చేశారా? హిందీలోనా?

హిందీలోనే, ఎందుకంటే మన రచయితల రచనలని వేరే భాషలవారికి పరిచయం చేయడం ఎక్కువ ముఖ్యమని నా ఉద్దేశం. కారణం, వర్ధమాన రచయితల రచనలని అనువదించేవారు తక్కువ. రెండోది, మన రచయితలు సామాజిక సమస్యలకి స్పందించి రాస్తున్నంత విరివిగా హిందీ రచయితలు రాయడం లేదు. విషయం, రచనా విధానం, శైలి అన్నింటిలోనూ మనమే వాళ్ళకన్నా ముందున్నాం. పైగా నా మాతృభాష తెలుగు. నా వాళ్ళని ఇతరులకి పరిచయం చేయడానికి కృషి చేయడం సహజమే కదా! హిందీ పుస్తకాలని ఇతర భాషలలోకి అనువదించడం సులువుగానే జరుగుతుంది. తెలుగు రచనలు ఇతర భాషలలోకి అనువదించడం అనేది అంతగా జరగడం లేదు. అందుకే ఆ ప్రయత్నానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాను. అనువాదాలని ప్రోత్సహించే ప్రభుత్వం, సంస్థలు ముందుకొస్తే మన పుస్తకాలు ఇంకా ఎక్కువ సంఖ్యలో హిందీలోకి, ఆంగ్లంలోకి వెళతాయి.

మీరు అనువాదం చేసిన పుస్తకాల్లో మీకు బాగా ఇష్టమయిన పుస్తకం ఏది?

మీరు అడిగింది కష్టమైన ప్రశ్నే... ఒక పుస్తకాన్ని అన్నిటికన్నా ఇష్టమైనదని చెప్పలేను. 40ఏళ్ళ కృషి, 68పుస్తకాలు వచ్చాయి. అంతేకాదు, నేను ఎంతో అభిమానించే ప్రేమ్‌చంద్‌కి సంబంధించిన పుస్తకాలు రెండు అనువదించాను. రెండింటికి పురస్కారాలు వచ్చాయి. మహాశ్వేతాదేవి కథలు అనువదించడం ఒక గొప్ప అనుభవం. ఇలా మన రచయితలలో మా నాన్న పుస్తకం 'చదువు' హిందీలోకి నా అనువాదం ద్వారా రావడం ఎంతో తృప్తి కలిగించింది. కవితానువాదాల్లో వరవరరావు, డా॥ఎన్.గోపి, కె.శివారెడ్డి, ఎన్.అరుణ మొదలైనవారి రచనల నా హిందీ అనువాదాలకి బాగా స్పందన వచ్చింది. వచనంలో సలీం రాసిన 'కాలుతున్న పూలతోట' నవలకి నేను చేసిన హిందీ అనువాదానికి 'జాతీయ మానవహక్కుల సంఘం' ప్రథమ బహుమతి ఇచ్చి సత్కరించారు.

అన్నీ అనువాదాలు ప్రజలను హత్తుకోలేవు? ఎందుకు? అనువాదాలు ఎలా ఉండాలని మీరు కోరుకుంటారు?

మనసుని హత్తుకోవాలంటే ఎంపిక ముఖ్యం. అది మొదటి మెట్టు. తర్వాత అనువాదకుడికి మూలభాషలోను, అనువాద భాషలోను మంచి ప్రవేశం ఉండాలి. ఎంపిక, అనువాదం మనసుపెట్టి చేస్తే చాలా వరకు అది పాఠకులని ఆకట్టుకుంటుంది. మరో విషయం, అనువాదాలు ఎంత సరళంగా ఉంటే అంత బాగా చదువరులని ఆకర్షిస్తాయి. నా విషయంలో హిందీ పాఠకులు, తెలుగు పాఠకులు అనేది నా అనువాదాలు సరళంగా చదివేందుకు హాయిగా ఉంటాయి అనే...

వ్యక్తిత్వ పుస్తకాలను కూడా అనువాదం చేశారు కదా? కమర్షియల్‌గా కూడా అనువాదం చేస్తున్నారా?

వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అనువాదాలు చేశాను. వాటికి ప్రచురణకర్తలు పారితోషికం ఇచ్చారు. కమర్షియల్‌గా అంటే, డబ్బు కోసం ఏది పడితే అది చెయ్యను. ఏ పుస్తకం అనువదించాలి అనే విషయంలో తుది నిర్ణయం నాదే. దీనికి ప్రచురణకర్తలు కూడా సహకరిస్తారు. ఒత్తిడి చెయ్యరు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాల్లో కూడా కొన్ని మంచివి అప్పుడప్పుడూ తగులుతూ ఉంటాయి. డేల్ కార్నెగీ రెండు పుస్తకాల అనువాదం నాకు చాలా సంతృప్తిని కలగజేసింది.

మన రచయితల రచనలని వేరే భాషలవారికి పరిచయం చేయడం ఎక్కువ ముఖ్యమని నా ఉద్దేశం. కారణం, వర్ధమాన రచయితల రచనలని అనువదించేవారు తక్కువ. రెండోది, మన రచయితలు సామాజిక సమస్యలకి స్పందించి రాస్తున్నంత విరివిగా హిందీ రచయితలు రాయడం లేదు.



అనువాద రంగంలోకి అడుగుపెట్టే నేటి యువతరానికి మీరిచ్చే సలహా?

అనువాదం చేయదలుచుకున్న భాషలని క్షుణ్ణంగా నేర్చుకోవడం ముఖ్యం. పుస్తకాలతోపాటు పత్రికలని కూడా చదవాలి. పాఠ్యపుస్తకాల భాష, పత్రికల భాష వేరుగా ఉంటాయి. వాడుక బాష ఉపయోగించాల్సిన చోట పెద్ద పెద్ద పదాలు ఉపయోగిస్తే కథనం దెబ్బతింటుంది. వీలైనంత సరళంగా రాస్తూనే మంచి నానుడితో కూడిన వ్యవహారిక భాష కథలు, నవలలు మొదలైన సాహితీ ప్రక్రియల అనువాదానికి అనువుగా ఉంటుంది. నా విషయమే తీసుకుంటే, ఈ తరం కథలు అనువదించేప్పుడు వాడే భాషకీ, 'అసురుడు'లాంటి రామాయణ కథకి సంబంధించిన పుస్తకాన్ని అనువదించేప్పుడు వాడే భాషకీ కొంత తేడా చూపించేందుకు ప్రయత్నించాను.

మీ కుటుంబ నేపథ్యం? మీ కృషి వెనక వారి సహకారం గురించి చెప్పండి?

అమ్మ, నాన్నల గురించి చెప్పేదేముంది. మీ అందరికీ తెలుసు ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు గారి కుమార్తెను. సాహితీ కుటుంబంలో పుట్టాను. నా భర్త గణేశ్వరరావు గారు ఇంగ్లీష్ సాహిత్యాన్ని క్షుణ్ణంగా చదివిన వ్యక్తి ఒకప్పుడు తెలుగులో కథలు కూడా రాసేవారు. అలా వివాహం తర్వాత కూడా ఇంట్లో సాహితీ వాతావరణంలో పెద్ద తేడా రాలేదు. ఎం.ఎ (హిందీ సాహిత్యం), బి.ఎడ్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి చేశాను. 6-7 సంవత్సరాలు టీచర్‌గా పనిచేశాను. ప్రస్తుతం ఫ్రీలాన్స్ అనువాదకురాలిని.

నా అనువాదాల్లో నాభర్త సహాయం చాలా ఉంటుంది. నా తెలుగు అనువాదాలు చూపించి సూచనలు, సలహాలు తీసుకుంటాను. నా పని తన పని అనుకోవడం ఆయన స్వభావం. అందుకే అంత త్వరగా అన్ని పుస్తకాలు అనువదించగలిగాను.

– ఆశాభారతి

■ కథ

సాయంకాలం గిన్నెలు కడుగుతున్న తాయమ్మ గొణుగుతూనే వున్నది. అక్కడే వంట గదిలో వున్న రమ వింటూ ఉడికిపోతున్నా ఏమన్లేక తన కసినంతా చపాతీ పిండి మీద చూపించసాగింది.

'కాంతమ్మా నొక్కి పాయూ!'

అంటూ టీవీలో ప్రకటన వస్తుంటే రాఘవ హాల్లోంచే యిద్దర్నీ పరికించి చూసాడు వస్తున్న నవ్వు ఆపుకుంటూ.

నవ్వుతున్న భర్తను ఉరిమి చూస్తూ

'ఆ వెధవ ప్రకటనలు చూడకపోతే కాస్త పెద్ద దానికి లెక్కలు చెప్పరాదూ టీవీ కట్టేసి!" అంది రమ

తాయమ్మ గిన్నెలు చప్పుడు చేస్తూ సర్దుతోంది. గ్లాసులు టపటపా బోర్లిస్తోంది. కంచాలు బొత్తిగా కుప్పవేస్తోంది. గరిటెలూ చెంచాలు ఘల్లున బాక్సుల్లో వేస్తోంది. ఇంకొకళ్ల మాట చెవి దూరనట్టుగా కంగాళీగా వుంది. తాయమ్మ మీద మండుకు పోయిందాపళాన.

పనిమనిషికో దండం

"కాస్త చిన్నగా సదరలేవూ చెవులు గళ్ళుపడుతున్నాయి వెధవ గోలకు." విసురుగా అంది తాయమ్మను.

"ఇయ్యాలగాదు నేను బోల్లు తోవి సదరబట్టి నాకెర్కలేదా?" అన్నది తాయమ్మ అంతకంటే తిక్కగా. అంతకు ముందే యిద్దరూ కాస్త ఘర్షణ పడ్డారు.

"ఏం తెల్సు నీ బొంద... బాగా మాటకు మాట నేర్చావు. మీ లేబరోళ్ల కన్నా కుక్కలు నయం తిన్న చోట విశ్వాసం అయినా చూపిస్తాయి."

"ఎహె పో... నీకిష్టం వుంటే జీతం పెంచి పనిచేయించుకో! లేకుంటే వూకో... నువ్వు సుతి ఇది వరకు లెక్కనే వున్నవా? జీతం పెంచమ్మా అంటే మాట్లాడ్త లెవ్వు..గా బాంకోల్లు సూడరాదు ఉగాదికి .. దస్రాకు కొత్త చీరలిస్తది వాల్ల పనిమనిషికి."

అంతే తీవ్రంగా తీసి పారేసింది తాయమ్మ.

"అక్కడ్నే చేసుకోఫో.. నేను అంత యియ్యను.. నీ లాంటోళ్ళు లక్షమంది దొరుకుతారు నాకు... పోన్లే అని ఊరుకున్నా కొద్ది నెత్తికెక్కుతున్నావు...ఫో ఫో.."

రమ ఇంకా ఏదో అనబోతుండగానే తాయమ్మ రాఘవ వున్న హాల్లోకి తొంగి చూస్తూ-

"అగ్గో ఇన్నావా సారూ.. ఆమె మాటలు... నీ మొకం చూసి ఇన్నొద్దులు చేసిన పని. ఈమె నోటి తీటకు ఎవ్వలు చెయ్యరు పని నీ యింట్ల. రేపట్నించి రాను ఎవలతోని చేపిచ్చుకుంటవో చేపిచ్చుకో..."

సర్దుతున్న అంట్లు అక్కడ్నే పడేసి అర్ధంతరంగా వెళ్ళిపోయింది తాయమ్మ.

తాయమ్మ వెనకే హాల్లోకి విసురుగా వచ్చింది రమ.

"చూసారా దాని పొగరు! ఇవ్వాళ పనికి వచ్చిందగ్గర్నించీ ఏదో వాగుతూనే వుంది. పొద్దున్నే మంతో పాటేగా దానికీ టీ పోసేదీ రోజూ తాగటంలా! ఇందాక అంటోంది నీళ్ల చాయ్ మీ యింట్లో తప్ప ఏ యిళ్ళలోనూ పొయ్యరుట. ప్రొద్దుట టమాటా పప్పు మిగిల్తే ఇచ్చాను, సాయంకాలం చపాతీలే కదా మనం తినేదని. ఛి ఛీ మీ పప్పు వాసనొస్తుంది గా బాంకోళ్ళమ్మ ఎంత కమ్మగా చేస్తది గీ పప్పు తిన్నా అరగది అంటూ నా కళ్ల ముందే అవతల పారేస్తోంది.. లేకికి సిరొస్తే లేచి లేచి పోతుందంటారు అందుకే" అంది కళ్లనీళ్ల పర్యంతం అవుతూ.

"అది ఒక్క చీర పెట్టమంటోందిగా పండక్కు.. పడేస్తే పోయేది." రాఘవ మాటలకు-

"మీరూరుకోండి.. పని వాళ్ళని నెత్తికెక్కించుకుంటే మళ్ళీ తల దిగరు. ఏదో గతి లేదంటే పాత చీరలు పడేస్తాం అంతేగానీ పండగ పండక్కూ కొత్త చీరలంటే మాటలా.. నా సంపాదనంతా దానిపాలే అవుతుందిహ,"

అంది రమ విసురుగా. రాఘుకు అర్థం అయ్యింది సీను. కూతుర్ని లెక్కలు చేస్తుండమని చెప్పి రమతో పాటు వంట గదిలోకి వచ్చాడు. ఆవిడ చపాతీలు చేస్తుంటే అతను కాల్చాడు. రమ కూర పొయ్యిమీద వేస్తే అన్నీ సర్దేసి టేబుల్ మీదకు చేర్చాడు. సీసాల్లో ఆమె నీళ్ళు నింపితే వాట్ని తెచ్చి ఫ్రిజ్జులో పెట్టాడు.

చిన్నపిల్ల నిద్దర్లో లేచి ఏడుస్తూ వంట గదిలోకి వస్తే ఎత్తుకుని వాకిట్లోకి తీసుకొచ్చాడు.

"చిన్న దాన్ని స్కూలు నుంచి రాంగానే పడుకో బెట్టవద్దంటే వినరు, చూడండి ఇప్పుడు లేచిందా ఎంత రాత్రికి పడుకుంటుందో నాకు నిద్దర లేకుండా చేసి."

అంది రమ పిల్లకు కంచంలో అన్నం కలుపుతూ విసుగ్గా.

రమా రాఘవ యిద్దరూ ఉద్యోగస్తులే. వాళ్ళకి యిద్దరు ఆడపిల్లలు. పెద్దది ఏడవ తరగతి చదువుతోంది. చిన్నది రెండో తరగతి చదువుతోంది. రోజూ స్కూలు వదిలేలోపు భార్యా భర్తల్లో ఎవరో ఒకరు ఇంటి దగ్గర ఉంటారు. "ఇలా ఇవ్వా కంచం" ఆమె చేతుల్లోంచి కంచం అందుకుంటూ-

"దానికేం తెలుసు మన చిరాకులూ పరాకులూ.. పగలంతా వుండం కదా, ఈ కాసేపయిన గారం పోదామనుకుంటుంది మన మీద"

అంటూ కూతురు బుగ్గలు ముద్దు పెట్టుకుని, ఏవో కథలు చెప్తూ అన్నం పెట్టడం మొదలుపెట్టాడు.-

రమ పెద్దదాన్ని కూర్చోబెట్టుకుని హోం వర్కు చేయిస్తూ ఆలోచిస్తోంది, పని మనిషి వ్యవహారం.

తాయమ్మని పన్లో పెట్టుకొన్న రోజుల్లో ఎక్కడా తిండి దొరకక ఆకులాగా అల్లాడి పోయేది. నలుగురి పిల్లల్ని సాదలేక. ఎక్కడ తిండి దొరికితే అక్కడి కల్లా పిల్లల్ని పంపి పనిచేయించేది తల్లి. అదంతా చూసి తనే ఆమెకు ధైర్యం చెప్పి ఒక పిల్లని స్కూల్లో వెయించి, ఇంకోదాన్ని బ్రిడ్జ్ స్కూల్లో వేయించి ఒకదాన్ని తన క్రింద పెట్టుకుంది. తిండి పెట్టి చదువు చెప్పించే ఒప్పందం మీద. ఆఖరుది చిన్నపిల్ల. దాంతో తాయమ్మ ఊపిరి పీల్చుకుని మనిషైంది.

తన ఉద్యోగంలో ఎప్పుడైనా పండగ పబ్బాలకు పై సంపాదన దొరుకుతే తాయమ్మ పిల్లలకు బట్టలనీ, ఫీజులనీ కట్టేది. దానికి తాయమ్మ తన పాదాలు పట్టుకుని ఏడ్చి కృతజ్ఞతలు తెలుపుకునేది. రెండేళ్ళు బాగానే గడిచాయి. చిన్న కూతురు రాధ పుట్టాక తాయమ్మ ఆఖరి కూతుర్ని చేతి

క్రింద వుంచుకుంది పనికోసం. తాయమ్మ కూడా ఒక అపార్ట్‌మెంటు చూసుకుని అందరూ దాన్లో పన్లు చూసుకోడం మూలాన కుటుంబం కాస్త తేరుకోడం మొదలైంది. తాయమ్మా దాని మొగుడు ఆలోచించుకుని పిల్లల్ని తన దగ్గర్నించి తీసికెళ్ళి హాస్టల్లో వేసారు. తిండీ గుడ్డా పుస్తకాలు ఫీజులూ అన్నీ ప్రభుత్వం చూసుకునే హాస్టల్స్ అవ్వి. దాంతో తనకు పిల్లలతో ఇబ్బందులు ఆరంభం అయ్యాయి.

చిన్నపిల్ల రాధకు మూతి కడిగి బట్టలు మార్చి తనతో పాటు హాల్లోకి తీసుకొచ్చాడు రాఘవ.

"ఎంత సేపూ పనిమనిషి ఆలోచనేనా? పిల్లల్ని పడుకోబెట్టు మనం కూడా తినేద్దాం.. రేపు నాకు ఆఫీసులో పనెక్కువగా వుంది. తొందరగా వెళ్ళాలంటే తొందరగా పడుకోవాలి."

రాఘవ మాటలకు పిల్లల్ని రూంలోకి తీసుకుపోయింది రమ.

★★★

తాయమ్మ రెండ్రోజులుగా పనిలోకి రావడం లేదు. సంక్రాంతి రోజులు కావడంతో అందరిళ్లలో పిండివంటలు చేసుకుంటున్నారు. పెద్ద పిల్ల వసుంధర మనమూ అప్పచ్చులు చేసుకుందామని పేచీ పెడుతోంది. పిల్ల పోరు పడలేక ఆఫీసునుంచొస్తూ ఏవోకటి తీసుకొస్తుంటే దానికి నచ్చడం లేదు.

"పిండ్లు పట్టించి ఇంట్లో మూకుళ్ళు పెట్టి చెయ్యాలి గావును

అందుకే దానికి విసుగు కావొచ్చు. "వసుంధ గొణుగు చసి నవ్వుతూ అన్నాడు రాఘవ.

"ఇద్దరు పిల్లలతో, ఇంట్లో పనితో ఎంత అలసటగా వుందో తెలుసా! పిండి వంటలట పిండి ంటలు." కసురుకుంది రమ.

"అసలు తాయమ్మ ఎందుకు రానందీ?" ఆసక్తిగా అడిగాడు.

"దాని బొంద.. పెద్ద కూతురి పెళ్లయ్యాక గర్వం పెరిగిందిలే దానికి. అందుకే అంటారు..." అంటూ సామెతల్లోకి దిగబోతుంటే ఆమె వాగ్ధోరణికి అడ్డం వస్తూ–

"దానికీ నేనడిగిందానికీ ఏంటి సంబంధం? అర్థం పర్థం లేకుండా మాట్లాడతావేం?" విసుక్కున్నాడు రాఘవ.

"ఆగండీ.. అక్కడికే వస్తున్నా. కూతురి పెళ్లయ్యాక అల్లుడికి మంగలి షాపు పెట్టియ్యాలని తాయమ్మ తను పనిచేసే ఇళ్లవాళ్లని తలా పదివేలు అడిగింది. నన్నూ అడిగింది. నా వల్ల కాదన్నాను. నేను వాళ్ల చిన్నప్పుడు చదువులకు డబ్బులు సర్దానా లేదా? నా దగ్గర లేవు పొమ్మన్నాను.

సణుక్కుంటూ పోయి బాంకు మేనేజర్ సుందరమ్మగార్ని పట్టుకుని లోను సంపాదించింది. ఇప్పుడు రెండో కూతురి పెళ్ళి పెట్టుకుంది, ఆ అల్లుడు సుందరమ్మగారి ఊరి పిల్లాడంట, ఆవిడే మాట్లాడిందట ఈ సంబంధం. ఇప్పుడయినా పెళ్ళికి ఓ పదివేలు ఇవ్వమన్నది.. చూద్దాం లెమ్మన్నాను." అంది రమ.

ఆమె మాటలకు కళ్ళు చికిలిస్తూ–

"మరేం చేస్తున్నావ్ ఇస్తున్నావా పదివేలు?" అడిగాడు.

"ఇంకా నయం – మొన్నేమయిందనుకున్నారూ.. మన చిన్నది రాధకు జ్వరం వచ్చింది.. మీరు మీ తమ్ముడుగారి ఊరికి వెళ్ళారు. డాక్టరు దగ్గరికి పిల్లను తీసికెళ్దామని తాయమ్మ చిన్న కూతుర్ని రమ్మన్నాను. అది ఇప్పుడే వత్తానమ్మగారు అమ్మతో సెప్పి అని అది కాస్తా తుర్రుమంది. ఇహ పత్తా లేదు. చీకట పడ్డదాకా చూసి నేనొక్కత్తినే వెళ్ళాను. మర్నాడు అది కనపడితే అడిగాను ఎందుకు రాలేదే అని. అది మా అమ్మ పోవద్దు అన్నదని చెప్పింది?" అంది రమ క్రోధంగా.

"ఏంటో ఎందుకొద్దందది?" ఆశ్చర్యంగా అడిగాడు రాఘవ.

"ఏవుందీ నాలుగిళ్ళలో పాచి కూడు ఎక్కువయ్యే సరికి పొగరు పట్టి వుంటారు. తాయమ్మ అంట్లు తోమడానికి వస్తే అడిగాను ఊర్కోలే.. డాక్టరు దగ్గరికి నీ కూతుర్ని రమ్మన్నన్నాను తోడు కోసం, నువ్వు వద్దన్నావట కదా ఎందుకు? అని. అదేం సమాధానం చెప్పిందో తెలుసా?"

తనకు తెలియని చరిత్ర చాలా వుందని గ్రహించాడు రాఘవ. ఆసక్తిగా భార్య వైపు చూసాడు చెప్పమన్నట్టు.

"నా పెనిమిటి వద్దన్నడు మీ యింటికి. బ్యాంకమ్మ గారు రమ్మన్నది గదా ఆడికే పంపు. ఎవలింటికి పంపినా కాల్లిరగకొడ్తనన్నడు అంది" పళ్ళు కొరుకుతూ అంది రమ.

అతనొక్కసారి షాక్ తిన్నాడు. అయినా తమాయించుకొని–

"ఏమో నిన్ను రెచ్చగొట్టాలని తాయమ్మే కల్పించి చెబుతుందేమో!" అన్నాడు చిన్నగా.

"అదీ తేలింది." రమ గొంతులోని మార్పు ఇట్టే పసిగట్టాడు. "ఏమనీ?!"

"దాని మొగుడొస్తే వదల్లేదు నేను. కడిగిపారేద్దామని ఎందుకు చేసావల అని అడిగాను. వాడేమో అవునమ్మగారూ నా పెండ్లాంతోని ఊకె అంటరట

గదా మీరు నీ బిడ్డలకు బట్టలిచ్చిన, తిండి పెట్టిన, ఫీజులు కట్టిన అని. వాల్ల చిన్నప్పుడు ఫీజులుంటే పది రూపాలో మా అంటే ఏబయి రూపాలుంటయ్యేమో గట్ల మీరిచ్చినయ్యన్నీ కల్పినా మూడువేలు అయితయ్యేమో కానీ నా బిడ్డలు చిన్నప్పటి కాంచీ మీకు చాకిరీ చెయ్యలేదా? పొద్దాక నా బిడ్డలు నీ సేతికింద వుండి ఎంత పని చెయ్యలేదు? ఆటికి మేవెన్నడన్న ఖరీదు గట్టినమా! అని వాడేందో నీతులు పలికాడు. వాడికీ టెంపరుకేం తక్కువ లేదు."

రమ రోషంగా లేచి వంట గదిలోకి వెళ్ళింది వంట చెయ్యడానికి. మామిడి కాయ తరిగింది. పప్పు, ముక్కలు కలిపి కుక్కర్‌లో వేద్దామని చూస్తే కుక్కర్ అంట్లలో వుంది. ఉస్సూరని అంది ప్రాణం. షెల్ఫ్‌లో వున్న చిన్న కుక్కర్ తీసి దాన్లో పప్పు పడేసి గ్యాస్ మీద పెట్టింది. పిల్లలు ఇంట్లోనే వున్నారు కదా ఇష్టంగా తింటారని అప్పడాలు వడియాలు వేయిద్దామని బాండీ కోసం వెతుకుతే అది కూడా ఎంగిలి కంచాల అడుగున కనిపించింది. వాటిల్లో చెయ్యి పెట్టి కడగాలంటే చిరాకు పుట్టింది రమకు. కంచాలూ గ్లాసులూ అన్నీ ఎంగిలివే కనిపిస్తున్నాయి. అవన్నీ కడిగి, వంట చేసి పిల్లలకు తినిపించి తాము తినాలంటే మధ్యాహ్నం దాటేట్టుగా వుంది.

విసుగ్గా కుక్కరు బందు చేసి హాల్లోకి వచ్చింది రమ. పిల్లలూ రాఘవ క్యారమ్స్ ఆడుతున్న వాళ్లలా రమని చూస్తూ–

"ఏం టిఫిన్ చేస్తున్నావీరోజు?" అడిగారు.

"టిఫినా పాడా.. ఆ బొచ్చెలన్నీ ఎవరు తోముతారు? నాకయితే టిఫిన్ చేసే ఓపిక లేదు. హాయిగా దోశెలు తిందాం హోటల్ నుంచి తెండి." అంటూ నీరసంగా సోఫాలో కూలబడిపోయింది రమ. రాఘవ లేచి తయ్యారవుతూ నవ్వాడు.

"ఇందాకే ఆ మాట అంటావనుకున్నాను. ఒకే.. టిఫిన్ తిన్నాక స్నానాలు

అవీ చేసి బైటికెళ్దాం .. మధ్యాహ్నమెక్కడైనా భోం చేసి సాయంకాలం సినిమా చూసి, రాత్రికి ప్యాకెట్స్ తెచ్చుకుందా హాయిగా వెన్నెల్లో తినేద్దాం ఒకే..“పిల్లలవైపు చూస్తూ బొటన వేలు పైకెత్తి అన్నాడు రాఘవ.”

రమ అడ్డుకుంది. తనకు ఇంట్లో చాలా పని వుంది కనుక తనెక్కడికీ రాలేనంది. సాయంకాలం వచ్చాక పని చేసుకోమన్నాడు రాఘవ. అంట్లు తోముకుని బూజులు దులుపుకుని ఇల్లు ఊడ్చుకుని బట్టలు ఉతుక్కునీ అలసిపోయి తెల్లారి ఆఫీసుకు పోలేనని యాష్టపడింది రమ.

“పని మనిషితో గొడవ వద్దంటే వినవు. ఇప్పుడు చూడు ఇంతింత పని రోజూ చేసుకోవడమంటే మాటలా...”

అతని మాట పూర్తి కాక మునుప గయ్యిమని లేచింది.

“అంటే ఏంటి మీ ఉద్దేశ్యం? నేనేదో పనిమనిషితో కావాలని గొడవ పడ్డానా? జరిగిందంతా చెప్పినా తప్పెవరిదో మీ కర్థం కాలేదా? మీరు కూడా ఆ పని మనిషికి వంత పాడ్డం నీచం.. ఛి.. ఛీ...”

ఉక్రోషంగా గదిలోకి వెళ్ళిపోయింది. హతవిధీ నుదురు కొట్టుకున్నాడు రాఘవ.

★★★

పని అలసట వల్ల రమకు జ్వరం వస్తోంటే ఆఫీసుకు సెలవు పెట్టేసింది. వారం రోజులుగా రాఘవ అందరినీ అడుగుతూనే ఉన్నాడు. ఇంట్లో పని చెయ్యడానికి పని మనిషి కోసం. వాళ్లడిగే నెల జీతాల బిల్లు విని అదిరిపోయాడు. నాలుగు గదులు ఉండి, వాకిలి ఊడ్చి చల్లే వాటా వుంటే వెయ్యి రూపాయలు. బట్టలు ఉతికి, అంట్లు తోమి ఇల్లు ఊడవడం అయితే రెండు వేలు పోనీ అలా పనిమనిషిని పెట్టుకుందామనుకున్నా ఎవ్వరూ రావడానికి రెడీగా లేరు. ఒకామె రెండు నెల్ల తరువాత ఎక్కడో పనిమానేస్తుందట అప్పుడు వస్తానంది.

తాయమ్మ రెండో కూతురి పెళ్ళి అయ్యింది. ఆ వారం రోజులూ ఆమె ఎవరిళ్లకూ రాలేదు. ఇల్లంతా ఎక్కడి వస్తువులక్కడే, పిల్లలు కూడా ఒక పొజిషన్ లేకుండా వున్నారు. ఏ రోజూ స్కూల్లో వాళ్ళకు తిట్లు తప్పడం లేదు. హోం వర్కు సరిగా చెయ్యడం లేదనీ, బట్టలు నీటుగా లెవ్వనీ, రాఘవకు కంప్లయింట్స్ వస్తున్నాయి.

పిల్లల ఏడుపు చూసి ఓపిక చేసుకుని వాళ్ల దగ్గర కూర్చుని వాళ్ళ హోం వర్కు చేయించింది రమ. పుస్తకాలన్నింటికీ దగ్గరుండి అట్టలు వేసి పిన్ కొట్టింది. ఈ పన్లన్నీ చేసే సరికి వంట అస్తవ్యస్తం అయిపోతున్నది.

అలాంటి భోజనం రాఘవకు సయించడం లేదు.

బచ్చలికూర పప్పు, వంకాయ కూర, అది కాకపోతే కంద పులుసు గోరు చిక్కుడు కాయ కూర పొంతన లేని రుచులకు ముద్ద లోపలికి దిగక సగం తిండి తిని లేచేవాడు. రమ పరిస్థితీ అంతే. ఒంట్లో ఓపిక తగ్గే సరికి దేనిమీదా ఆసక్తి లేకుండా పోయింది. రుచిగా వంట చేసి ఎన్నాళ్లయ్యిందో!

ఒకరోజు మధ్యాహ్నం పూట రాఘవ పనికట్టుకుని తాయమ్మ వుండే వీధికెళ్ళాడు. బీదల కాలనీ అని ఉరికెనే గుర్తుపట్టేయ్యవచ్చు. గుడిసె తలుపు దగ్గరగా వేసుంది. తాయమ్మా అంటూ గట్టిగా పిలిచాడు రాఘవ. తాయమ్మ గుడిసె తలుపు నెట్టి బైటికొచ్చి అతన్ని చూసి కంగారుపడిపోయింది. “బాబు గారు మీరు కూసుందుకు సుత కుర్చీ లేకుంటున్నం.” బాధపడిపోయింది.

“సరి.. సరి.. మరేం పర్లేదు గానీ ఒక మాట చెప్పు మా యిల్లు పూర్తిగా మానేసినట్టేనా!” సూటిగా అడిగాడు.

“అమ్మగారి కోపం సూసినారు గదా సారూ.. ఇది వరకు ఇద్దరాడి పోరగాళ్ళు నా సేతి కిందుండి అక్కడో ఇక్కడో సంపాయిత్తే అందరం కడుపు నిండా తిన్నాం. ఇప్పుడు వాళ్ళ పెళ్ళిల్లు సేసి పంపినాం. అప్పయినాది. నా తాగుబోతు పెనిమిటీ నేనూ సంపాయించేది దేనికీ సరిపోత లేదు. ఆఖరి పిల్లగాల్లిద్దరూ బల్లేకే పోతుంటిరి. నా రెక్కల కట్టం సూసైనా అయ్యగారు జీతం పెంచడైరి. దసర పండగ్గకు ఒక్క సీరె ఇయ్యమంటే.. బాంకోల్లు ఇస్తున్నరు గదమ్మా అంటే .. అమ్మగారు కోపంతో ఊకె పన్లెకెల్లి నడువు... ఎల్లిపో ఎల్లిపో అనవట్టే...మాగ్గూడ ఇజ్జతు వుంటది గదా సారూ....”

తాయమ్మ బాధగా కండ్లు తుడుచుకున్నది.

రాఘవకు ఆమె మాటలు న్యాయంగానే తోచాయి. తాయమ్మ రాని ఈ నెలంతా ఎంత నరకం పడ్డామో తెలిసొచ్చింది. జ్వరాలొచ్చినపుడు మందులకూ హోటల్ తిండ్లకూ అయిదారు వేలయినాయి. అయినా మనశ్శాంతి లేకుండా పోయింది. జేబులోంచి పన్నెండు వందలు లెక్కపెట్టి తాయమ్మ చెతిలో పెడ్తూ–

“అమ్మ గారికి వెయ్యే అని తెలుసు. నెల నెలా రెండు వందలు నేను ఇస్తాను. ఈ మాట అమ్మగారితో అనకు. నాలుగైదు నెల్లు పోయాక జీతం పెంచుతామని చెప్పి పన్నెండు వందలు ఇస్తాను. సరేనా రేపట్నించి పన్లోకి రా.” అన్నాడు.

తాయమ్మ బదులు పలుకలేదు. రాఘవకు అర్థం కాలేదు.

“ఏమంటావు తాయమ్మా బదులు పలుకవూ?”

“బాబూ పండక్కు చీర? నసిగింది చిన్నగా.

“సరే!” అన్నాడు నీరసంగా.

“బాబుగారు పండగ రోజున మేం పనిచేసేటందుకు రాం. మా పనోల్ల సంఘంల రూలు పెట్టింల్రు గది ముందుగాల తెలుసుకోండ్రి,”

“మైగాడ్.. పండగ రోజున మేం పని చేసేటందుకు రాం. మా పనోల్ల సంఘంల రూలు పెట్టింల్రంట గది ముందుగాల తెలుసుకోండ్రి.”

“మైగాడ్.. పండగ నాడు రాకపోతే ఎలా? చుట్టాలొస్తే మేం ఏం చెయ్యాలి?” ఆదుర్దా పడ్డాడు రాఘవ.

“నాలుగైదు ఇండ్లు చేసుకుంటా కదా అందుకని గీ టైంలారా గా టైంలరా అని లొల్లి పెట్టొద్దట సారూ.. అది సుత సంఘంల తీర్మానం చేసిండ్లంట.” అన్నది.

‘హతోస్మీ’ అనుకున్నాడు.

“మల్ల ఇనరూ...” తాయమ్మ ఇంకేదో చెప్పబోతుంటే–

“వద్దు.. వద్దు... ఇంకేం వినను..నువ్వన్నవన్నీ ఒప్పుకుంటున్నా నువ్వేదంటే అదే సరేనా.. రేపట్నించి పన్లోకి రా.”

అంటూ వెనక్కి చూడకుండా గబగబా వెళ్ళిపోయాడు పరుగులాంటి నడకతో.

తాయమ్మ తన చేతిలో వున్న పైసలు చూసి, అతని పరుగును చూసీ నవ్వుకుంది, అమ్మగారికిప్పుడు తెలిసొచ్చింది పనిమనిషంటే అని.

– తమ్మెర రాధిక, 9440626702



జోక్స్ కార్నర్

నిలబడి

టీచర్ : మీ అందరి పరిస్థితి ఆశాజనకంగా లేదు. పాసయ్యేట్టు లేరు. అందుకే మిమ్మల్ని పరీక్షల్లో కూర్చోబెట్టటం లేదు.

విద్యార్థులు : మీరు మమ్మల్ని కూచ్చోబెట్టకపోయినా పర్వాలేదు సార్. మేం నిలబడే రాస్తాం.

వద్దన్నాక కూడా

రాజేష్ : మీ హోటల్‌కి ఇంకెప్పుడూ రాను.

హోటల్ మేనేజర్ : ఏమైంది సార్.

రాజేష్ : నాకింకేం వద్దని చెప్పిన తర్వాత కూడా మీ సర్వర్ బిల్లు తెచ్చి చేతిలో పెట్టాడు.

కళ్ళజోడు

భర్త : కాంతం! నిన్ను కళ్ళజోడు పెట్టుకోకుండా వంట చేయొద్దని ఎన్నిసార్లు చెప్పాను? చూడు కూరనిండా వెంట్రుకలే.

భార్య : మిమ్మల్ని కళ్ళజోడు పెట్టుకోకుండా భోజనం ముందు కూర్చోవద్దని లక్ష సార్లు చెప్పాను. మీరు చూస్తున్నవి వెంట్రుకలు కాదు. కొత్తిమీర కాడలు.

అసలు విషయం

భర్త : మా బాస్ నాకు ప్రమోషన్ ఇచ్చారు తెల్సా?

భార్య : అవునా! అయితే మీరు ఆఫీసులో బాగా పని చేస్తున్నారన్నమాట.

భర్త : ఆయన నాకు ప్రమోషన్ ఇచ్చింది ఆఫీసులో పని చేసినందుకు కాదు, వాళ్ళింట్లో పని చేసినందుకు.

ఎలా భరిస్తావు?

అజిత్ : ఏరా సుందర్! నువ్వు ఎలాంటి అమ్మాయిని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నావు?

సుందర్ : బాగా తెలివైన, బుద్ధిమంతురాలైన, ఓర్పుగలిగిన, అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను.

అజిత్ : అయ్యో! ఈ కాలంలో ఒక్కళ్ళని పెళ్ళి చేసుకుంటేనే ఆ సంసారాన్ని ఈదటానికి కనాకష్టంగా ఉంది. మరి నలుగురిని చేసుకుని ఎలా మేనేజ్ చేస్తావురా!

మీకు తెలీదా?

గోపాలం : ఒరేయ్ రాజేశం! చదువు మనకు చాల అవసరం రా. మనందరం అర్జంటుగా చదవటం నేర్చుకోవాలి.

రాజేశం : ఎందుకురా.

గోపాలం : ఎందుకంటావని అంత చిన్నగా అడుగుతున్నావేంటి? మనం తినే ప్రతి మెతుకు మీదా మన పేరు ఉంటుందట. తినేముందు మన పేరుందో లేదో చదువుకుని తింటే నయం కదా.

కోతి జాతి

పాప : నాన్నా! మనుషులు ఎలా పుట్టారు?

తండ్రి : పునరుత్పత్తి ద్వారా మనుషుల సంతతి పెరుగుతుందమ్మా.

పాప : (వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి) అమ్మా మనుషులు ఎలా పుట్టారు?

తల్లి : కోతి జాతి నుండి కాల క్రమేణా వృద్ధి చెందుతూ మనుషులు తయారయ్యారు.

పాప : నాన్నా నువ్వెందుకు అబద్ధం చెప్పావు? మనం కోతి జాతి నుండి అంట కదా పుట్టింది.

తండ్రి : మీ అమ్మ వాళ్ళ కుటుంబం గురించి చెప్పిందమ్మా.

గొడవ

సురేష్ : మన వాసు ఎప్పుడూ ఎవరితోనో ఒకరితో, ప్రతి దానికీ గొడవ పడుతూనే ఉంటాడేంట్రా?

రమేష్ : ఎప్పుడూ గొడవ పడుతుంటాడని ఎలా చెప్తున్నావ్?

సురేష్ : నిన్న సినిమాకి ఇద్దరం కలిసి వెళ్ళాం. గేట్ కీపర్ టికెట్ చింపి లోపలికి పంపిస్తుంటే, టికెట్ చింపాడని అతనితో గొడవ పడుతున్నాడు.

నెమలీక

గొప్పలతో వచ్చిన తిప్పలు

తమకు అవసరమైన సరుకులు కొనుక్కుందామని పట్టణానికి వెళ్తున్నారు అంజయ్య అనే తోటమాలి, రాజయ్య అనే ఆవుల కాపరి, చంద్రయ్య అనే పహారా చేసే వ్యక్తి. వారు ముగ్గురూ ఒకరికి ఒకరు తెలియదు. దారిలో ఒక సత్రంలో బస చేసినప్పుడు ఒకరి గురించి మరొకరు తెలుసుకున్నారు. పరిచయాలయిన తర్వాత ఎవరి గురించి వాళ్ళు తమ గొప్పలు చెప్పుకోవటం మొదలుపెట్టారు.

"నేను ఆంబోతులా రంకె వేశానంటే చుట్టుపక్కన కోసెడు దూరంలో గుంపుగా గడ్డి మేస్తున్న పశువులన్నీ చెల్లాచెదురైపోతాయి తెల్సా?" అన్నాడు రాజయ్య.

'అదేముంది! నేను వేటకుక్కలా భౌమని అరిచానంటే తోటలో జొరబడ్డ దొంగ భయంతో చెట్టెక్కవలసిందే. ఒకవేళ ఏ పులో దారి తప్పి అటువస్తే, తోకముడిచి పరుగెత్తవలసిందే!" అన్నాడు అంజయ్య.

"అంతేనా! అర్ధరాత్రి సమయంలో నేను కోడిలా కొక్కొరొక్కో అని కూశానంటే తూర్పున సూర్యుడు అప్పటికప్పుడు ఉదయించాల్సిందే" అన్నాడు చంద్రయ్య.

అదే సత్రంలో మూలన పడుకున్న ఓ వేటగాడు ఆ ముగ్గురి గొప్పలు విని వాళ్ళని ఆటపట్టించాలని సరదా పుట్టింది. వెంటనే పులిగా పెద్దగా గాండ్రించాడు.

అంతే! నిజంగా పులి గాని అక్కడికొచ్చిందేమోనని అంజయ్య, రాజయ్య, చంద్రయ్య తమ దగ్గరున్న వస్తువులను ఎక్కడివక్కడ పడేసి తలొక దిక్కుకు పరుగెత్తారు. అది చూసిన వేటగాడు 'పిరికి పందలు. గొప్పలు చెప్పుకోవటమే తప్ప, కొంచెం కూడా ధైర్యంలేని ఒట్టి పిరిగ్గొడ్డులు' అనుకుని నవ్వుకున్నాడు.

పేర్లేంటి?

చిన్నారులూ... మీకు ఆటలంటే చాలా ఇష్టం కదూ!
ఇక్కడ కొన్ని రకాల ఆటలాడే పిల్లలున్నారు.
వాళ్ళు ఆడే ఆటల పేరేంటో చెప్పండి.



ఎన్నున్నాయ్



ఇక్కడ చాలా వస్తువులు కనిపిస్తున్నాయి చూశారుగా. వాటిలో ఇంగ్లీషు అక్షరం B తో మొదలయ్యే వస్తువులు ఎన్నున్నాయో గుర్తించండి.

శిశిర్ కుమార్ మిత్ర

శిశిర్ కుమార్ మిత్ర 1923 సంవత్సంలోనే భారతదేశం రేడియో ట్రాన్స్ మిటింగ్ స్టేషన్ నెలకొల్పారు. 1927లో మన దేశంలో రేడియో ప్రసారాలు ప్రారంభం అయ్యాయి. రేడియో ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ రంగం స్థాపించి, అందులో చేసిన కృషి, పరిశోధనల ద్వారా వీరికి ప్రపంచఖ్యాతి లభించింది. వీరు ఐనోస్పేర్ గురించి బాగా పరిశోధనలు చేశారు. రేడియో స్టేషన్‌గాని, టీవీ స్టేషన్‌గాని ప్రసారం చేసే తరంగాలు భూ ఉపరితలం మీద వ్యాపించిన అయొనొస్ఫియర్‌ను తాకి, తిరిగి భూమికి ప్రసరిస్తాయి. దీని వలన మన రేడియోలు, టీవీలు ఆ తరంగాలను గ్రహించి ప్రసారాలను అందించగలవు. శిశిర్ కుమార్ మిత్రకు 1962లో పద్మభూషణ్ లభించింది.

తేడాలు

ఈ రెండు బొమ్మల్లోని పది తేడాలు ఎక్కడెక్కడున్నాయో కనుక్కోండి.

దారేది?



రెండు కళ్ళతో రెండు దృశ్యాలు

* ఇవి గుంపులుగా జీవిస్తాయి.
* ఒక్కో గుంపులో వెయ్యి జీబ్రాలుంటాయి.
* పుట్టిన పిల్ల జీబ్రా దగ్గరకు వేరే జీబ్రాలను దగ్గరికి రానివ్వదు తల్లి జీబ్రా. తన స్పర్శ, వాసన, స్వరాన్ని పిల్ల జీబ్రా గుర్తుపట్టగలిగినప్పుడే ఇతర జీబ్రాలతో వాటిని కలవనిస్తుంది.
* ఇవి గంటకు 40 కిలోమీటర్ల వేగంతో పరుగెడతాయి.
* పిల్ల జీబ్రాలు పుట్టిన గంటకే పరుగెడతాయి.
* జీబ్రాలు నిలబడే నిద్రపోతాయి.
* జీబ్రాలు తన చెవులను అన్ని వైపులకు, ఎలా పడితే అలా తిప్పగలవు.
* చెవుల కదలికలను బట్టి వాటి మూడ్‌ను గురించవచ్చుట.
* ఇవి అడ్డదిడ్డంగా పరుగెట్టడం మూలంగా వీటిని పట్టుకోవటం చాలా కష్టం.
* వీటి కాళ్ళు చాలా బలంగా ఉంటాయి. వెనుక కాళ్ళ లేపి ఒక్క తన్ను తన్నాయంటే శత్రువును ఎంత భారీ జంతువైనా ఓడిపోవాల్సిందే.
* గుంపుగా ఉన్న జీబ్రాల శరీరం మీది చారలు క్రూరమృగాలను కమక పెడతాయి. దాంతో శత్రువులు వాటిని పట్టుకోలేవు.
* ఒకవేళ ఏదైనా మృగం ఒక జీబ్రామీద దాడి చేసినా మిగతా జీబ్రాలన్నీ కలిసి ఆ మృగాన్ని తరిమి కొట్టడానికి ప్రయత్నిస్తాయి.
* ఏ రెండు జీబ్రాల ఒంటి మీది చారలు ఒకేలా వుండవు.
* ఇవి పచ్చ రంగును గుర్తించలేవు.
* వీటి కంటి నిర్మాణం ప్రత్యేకంగా వుంటుంది. ఒకేసారి రెండు కళ్ళతో రెండు రకాల దృశ్యాలను చూడగలవు.



■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

హాలండ్ నుండి ఖాళీ చేతులతో తిరిగి వచ్చిన జెన్నీ (పిల్లల కోసం ఒక బొమ్మ మాత్రం యిచ్చాడట లయన్ ఫిలిప్) పిల్లలను గుండెలకు హత్తుకుని మైమరిచి పోయింది. ఎన్ని యిబ్బందులున్నా ఎంత ఇరుకుగావున్నా ఇది తన యిల్లు. తన జీవితం. మార్క్స్ లండన్‌కు వచ్చిన తొలి రోజుల్లో ఆయనతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి ఆగస్ట్ విల్లిష్ సంపన్న కుటుంబంలో పుట్టినా కమ్యూనిస్టుగా మారాడు. 1848లో జరిగిన తొలి కమ్యూనిస్టు తిరుగుబాటు వ్యూహకర్తల్లో ఒకడు. ఆ (తిరుగుబాటులో) ఎంగెల్స్ అతని నాయకత్వంలో పనిచేశాడు. విల్లిష్ యిప్పుడు లండన్‌కు వచ్చి మార్క్స్ కూడి భుజంగా మారాడు. పార్టీ వ్యవహారాలూ రహస్య కార్యకలాపాలూ పర్యవేక్షించాడు. అయితే సైద్ధాంతిక చర్చలు, కబుర్లు అతడికిష్టం. అందగాడే కాని విచిత్ర వేషధారణలో జెన్నీకి అతడు డాన్ క్విక్సాట్‌లా కనిపించాడు.

మార్క్స్ అతడి దూకుడుకు అడ్డు కట్ట వేసే ప్రయత్నం చేశాడు. ఒక వుదయం జెన్నీ బెడ్‌రూంలోకి దూసుకు వచ్చిన విల్లిష్ బిగ్గరగా నవ్వుతూ 'సహజ' కమ్యూనిజం మీద సైద్ధాంత చర్చ ప్రారంభించారు. ఎన్నిసార్లు యిలా చెయ్యవద్దని వాదించినా అతని పద్ధతి మారదే. అసలు విషయమేమంటే జెన్నీ మీద కన్నేశాడు విల్లిష్.

పిల్లలే మార్క్స్ జీవితంలో వెలుగులు. దేశాలు మారటం, ఇళ్లు మారటం, చలి, ఆకలి, భాష తెలియని కొత్త వూరు ఇలా ఎన్ని సమస్యలున్నా ' పిల్లలు చలాకీగా ఆడుతూ పాడుతూ వున్నారు' అంది జెన్నీ. కాస్త బొద్దుగా వుండే మూడేళ్ల ఎడ్గార్ తన కోతి చేష్టలతో అదన్నీ నవ్విస్తారు. గొంతు చించుకొని తమాషా పాటలు పాడతాడు రోజంతా. ఫైల్‌గ్రాత్ రాసిన 'మార్సె ' నుండి వాడు ' కమ్, ఓ, మూన్' అనే పాట అందుకున్నాడంటే యిల్లు మార్మోగిపోతుంది.

ఆమెను ఇష్టపడటం సహజమనిపించివుంటుంది అతడికి. తను అరిస్టోక్రాట్. ఆమె అరిస్టోక్రాట్. పెళ్లి చేసుకొని పేదరికంతో మగ్గుతోంది. 'అన్ని కుటుంబాల్లో యిలాంటివి జరుగుతాయి. గాలమేసి చూశాడు" అంది జెన్నీ. చేప చిక్కలేదు. కాని మార్క్స్ అసూయతో రగిలిపోయాడు.

మార్క్స్, ఎంగెల్స్, విల్లిష్ ముగ్గురూ లీగ్‌లోనూ శరణార్థుల విషయాల్లోనూ కలిసి పనిచేశారు. కాని మార్క్స్ ప్రకారం, 'వ్యక్తిగత' కారణాల వల్ల తమ మధ్య కొంత దూరం ఏర్పడింది. 1848 నుండే, సైద్ధాంతక కృషిని పక్కన పెట్టి రాజకీయ నిరసనలూ ప్రభుత్వ వ్యతిరేక పత్రికా రచనకు సమయమంతా కేటాయించినా, విప్లవం అంత త్వరలో వచ్చే అవకాశం లేదని స్పష్టమవుతూనే వుంది. కాని విల్లిష్‌కు సాహసాలూ, రహస్య కార్యకలాపాలూ ఇష్టం. కొద్ది మంది సభ్యులున్న లీగ్‌లో తిరుగుబాటు సాధ్యమని వాదించాడు. సామాజిక మార్పుకు చాలా కాలం పడుతుందన్న మార్క్స్ అభిప్రాయం తప్పన్నాడు. విప్లవం దానంతటదే రాదు. దానికి అనువైన పరిస్థితులను కల్పించాలి. దానికి సమయం పడుతుంది. అంటాడు మార్క్స్. హింసతో విప్లవం సాధ్యమే అంటాడు విల్లిష్.

వీళ్ల వాదనలతో ఒక విషయం స్పష్టమవుతుంది. మార్క్స్ సామాజిక పరిణామ క్రమాన్ని నమ్మాడే తప్ప తక్షణ విప్లవాలను కాదు. అతని అభిప్రాయాలు విప్లవాత్మకమైనవేగాని ఆచరణ పరిణామ క్రమాన్ని సమర్థిస్తుంది. మార్క్స్ ప్రకారం, ఒక చారిత్రక పరిణామ క్రమంలో భాగంగానే విప్లవం సాధ్యపడుతుంది. కాని అపరిపక్వదశలో హింసద్వారా కాదు. ఒక సామాజిక శాస్త్రజ్ఞుని అవగాహన ప్రకారం రాజకీయ, సామాజిక కార్యకలాపాలలో పాల్గొని పాత సమాజం అంతరించి కొత్త సమాజం ఏర్పడటానికి రెండు పరిణామా దశలు అవసరం: ప్రజాస్వామిక స్వేచ్ఛలన్నింటినీ వుపయోగించుకొని సామాజిక రాజకీయ కార్యకలాపాలలో పాల్గొని కార్మిక సంఘాల ద్వారా ప్రజలలో వర్గ చైతన్యం పెంపొందించాలి. రెండు: వర్గరహిత కమ్యూనిస్టు సమాజానికి ముందు కొంత కాలం పెటీ బూర్జువా పాలన కొనసాగుతుంది. ఇదంతా పిరికివాళ్ల వాదన అంటాడు విల్లిష్. విప్లవ పోరాటం నుండి విరమించి సుఖజీవితాన్ని కోరుకుంటున్నాడు మార్క్స్ అని అతని అభియోగం.

వెంట ప్రైవేటు సైన్యం వుంటే తప్ప విల్లిష్ ఒంటరిగా ఎక్కడికీ కదలడు. అందువల్ల మార్క్స్‌కు వ్యతిరేకంగా ఒక గ్రూప్‌ను పోగుచెయ్యటానికి కూడా ప్రయత్నించాడు. అతడు అరిస్టోక్రాట్ అయినా, అతడి సమర్థకులందరూ జర్మన్ శరణార్థుల్లోని కార్మికులే. వాళ్లతోనే కలిసి నివసించాడు. కలిసి భోజనం చేశాడు. అందర్నీ ఎంతో స్నేహంగా 'నువ్వు' అంటూ సంభాషించాడు. ఈ కారణాల వల్ల అతనికి కార్మికుల్లో మార్క్స్ కన్నా పరపతి పెరిగింది. కార్మికుల నుండి సేకరించిన విరాళాలతో మార్క్స్ బూర్జువా కుటుంబ జీవితం జరుపుకుంటున్నాడని పుకార్లు పుట్టించారు. అంతకు ముందు, మార్క్స్ ఎంగెల్స్ లండన్‌లో వున్న 'యూనివర్సల్ సొసైటీ ఆఫ్ రివల్యూషనరీ కమ్యూనిస్ట్స్' అనబడే సంస్థతో సంబంధాలు పెట్టుకున్నాడు. ఇదే సంస్థలోని ఎమాన్యుయెల్ బార్తెలెమీ అనబడే నేరస్తుడితో పరిచయం పెంచుకున్నాడు విల్లిష్. హత్యలకు, రాజకీయాలను ముసుగుగా వాడుకుంటాడు ఎమాన్యుయెల్.

మార్క్స్‌కు సన్నిహితుడైన యిరవై నాలుగేళ్ల యువ కమ్యూనిస్టు లీబ్ క్నెష్ట్ ప్రకారం, విల్లిష్, బార్తెలెమీలు మార్క్స్‌కు వ్యతిరేకంగా కుట్ర చేశారు. 'ఇతడు ద్రోహి. ద్రోహిని చంపెయ్యాల్సిందే' అన్నారు. కొన్నాళ్ల తర్వాత లీగ్ సమావేశానికి హాజరైన విల్లిష్ మార్క్స్‌ను పబ్లిగ్గా అవమానించి 'డ్యుయెల్'కు చాలెంజ్ చేశాడు. ఇది రాజకీయ శత్రుత్వంగా కనిపించినా, దీని వెనక అతడు జెన్నీని ఆశించడం అంతకన్నా ఎక్కువ. బార్తెలెమీ లాంటి నేరస్తుడి ప్రభావం కూడా వుండి వుంటాయని మరచిపోకూడదు.

డ్యుయెల్ వంటి పోట్లాటలకు విరుద్ధం మార్క్స్. అంతేకాక ఇంగ్లండులో వీటి మీద నిషేధం వుంది. అయినా కాన్రాడ్ ష్రామ్ అనబడే మార్క్స్ సన్నిహితుడు విల్లిష్‌ను అవమానించి, డ్యుయెల్‌కు తాను సిద్ధమన్నాడు. ఇప్పుడు పోట్లాట 24 ఏళ్ల ష్రామ్, 49 ఏళ్ల విల్లిష్ మధ్య. మార్క్స్ ఎంత వారించినా వినకుండా ష్రామ్, ఆ రాత్రికే మరో పోలిష్ అధికారితో కలిసి బెల్జియం వెళ్లాడు. విల్లిష్ బార్తెలెమీలు కూడా అటో యిటో తేల్చుకోవడానికి బయల్దేరారు. పిస్టల్స్‌తో జరుగుతుంది డ్యుయెల్. అప్పటివరకు ఒక్కసారి కూడా పిస్టల్ కాల్చలేదు ష్రామ్. ఒక్కసారి కూడా గురి తప్పలేదు విల్లిష్.

మరునాడు సెప్టెంబర్12న మార్క్స్ అపార్ట్‌మెంట్‌లో కూర్చున్నాడు

లీబ్‌క్నెష్ట్. జెన్నీ, లెంచెన్ కూడా వున్నారు. ఈ డ్యూయెల్‌కు కారణం జెన్నీ కాదు. కానీ విల్లిష్ స్వభావం తెలుసు కనక తనకు ఇందులో బాధ్యత వుందనుకొంది జెన్నీ. రోజంతా వార్త ఏమైనా తెలుస్తుందేమోనని ఆందోళనగా నిరీక్షించారు. చివరికి మార్క్సు లీబ్‌క్నెష్ట్ అపార్ట్‌మెంట్ నుండి బయటకు వెళ్లిన తర్వాత బార్తెలెమీ వచ్చి 'ష్రామ్‌కు తలలో తగిలింది బుల్లెట్' అని చెపి వెళ్లాడు. ఇంకేముంది అనుకున్నదంతా అయింది.

మార్క్సు లీబ్‌క్నెష్ట్‌లు తిరిగి వచ్చిన తర్వాత దుర్వార్త చెప్పింది జెన్నీ. అందరూ విషాదంలో మునిగిపోయారు. ఒక మంచి మిత్రుణ్ణి కోల్పోయామన్న దు:ఖం వాళ్లను వివశుల్ని చేసింది. అయితే అందర్నీ ఆశ్చర్యపరుస్తూ తెల్లవారి తలుపు తెరచుకుని నవ్వుతూ ప్రవేశించాడు ష్రాం. 'కాస్త గీసుకుపోయింది. చిన్న గాయమే. డాక్టరు కట్టుకట్టాడు' అన్నాడు నవ్వుతూ. ష్రామ్ బతికాడుకాని మార్క్సు విల్లిష్‌ల సంబంధం పూర్తిగా తెగిపోయింది. నాలుగు రోజుల తర్వాత లీగ్ కేంద్ర కార్యవర్గంలో చీలిక వచ్చింది.

ఇక, కేంద్ర కార్యవర్గ సమావేశం గురించి: మార్క్సు మేధస్సు వజ్రం లాంటిది. అంత కఠినం. అంత ప్రకాశవంతం, చర్చలు, వాదోపవాదాలలో అంతిమ విజయం తనదేనని మార్క్సుకు తెలుసు. ప్రైవేటు మీటింగుల్లో ఉద్రేకపడి అరుస్తాడుగాని యిలాంటి బహిరంగ సమావేశాల్లో ప్రశాంతంగా వుండి ఎదుటి వాళ్లకు చెమటలు పట్టిస్తారు. ఆ మీటింగులో మార్క్సు మూడు ప్రతిపాదనలు పెట్టినప్పుడు ప్రత్యర్థులకు ఇదే పరిస్థితి ఎదురైంది.

మార్క్సు ప్రతిపాదనలు: 1. సంచాలక వర్గం లండన్ నుండి కొలోన్‌కు వెళ్లాలి. 2. ప్రస్తుతం వున్న రూల్స్‌ను రద్దు చేసి కొత్తవి రాసుకోవాలి 3. లండన్‌లోని లీగ్ కార్యాలయం రెండుగా విభజించబడాలి. రెండూ కొలోన్‌కే తమ నివేదికలు పంపిస్తాయిగాని దేనికదే స్వతంత్ర సంస్థగా వుంటుంది.

ఈ ప్రతిపాదనల్ని తక్షణం ఆమోదించాల్సిన అవసరం వుంది. ఎందుకంటే మనం కార్మికులకు పదిహేను, యిరవై, యాభై ఏళ్లు కూడా పోరాటం చెయ్యక తప్పదని చెడుతున్నాం. కాని మనలోని ఒక వర్గం అధికారం తక్షణమే చేజిక్కించుకోవాలంటోంది. నాకు కేవలం పన్నెండు మంది సభ్యులుంటే చాలు మిగతావాళ్లు కార్యక్రమం నుండే వెళ్లిపోవచ్చు అన్నాడు మార్క్సు.

కార్ల్ ష్నాపర్, మార్క్సుకు సన్నిహితుడే కాని మరో పక్షం వైపు పోతానన్నాడు మార్క్సు చారిత్రక పరణామ సిద్ధాంతం కొందరికి 'అతి నెమ్మది' వ్యూహంగా కనిపించింది. మరణం తథ్యమని తెలిసినా తను జర్మనీకి వెళ్లి యుద్ధంలో పాల్గొంటానన్నాడు ష్నాపర్. 'ఒకవేళ మార్క్సు, లీగ్‌ను విడగొట్టదలచుకుంటే కలంతో పోరాటం చేసే వాళ్లు ఒకవైపు, సాయుధ యుద్ధానికి సిద్ధపడిన వాళ్ల మరొక వైపు వుంటే బాగుంటుంది".

ఈ ప్రతిపాదనకు నిరసనగా విల్లిష్ వాకౌట్ చేశాడు. ఓటింగ్ జరిగింది. మార్క్సు గ్రూప్ మాత్రమే ఓటింగ్‌లో పాల్గొంది. విభజన ప్రతిపాదన నెగ్గింది. లండన్‌లోని అసమ్మతివాదుల్ని బహిష్కరించమని కొలోన్‌లోని కేంద్ర కార్య వర్గాన్ని కోరాడు మార్క్సు. ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది కొలోన్.

మార్క్సు సాధించిన ఈ విజయానికి తోడుగా కమ్యూనిస్ట్ మానిఫెస్టో'ను 'రెడ్ రిపబ్లికన్' అనబడే యింగ్లీషు పత్రికలో ప్రచురించారు. రచయితల పేర్లు 'సిటిజన్స్ చార్ల్ మార్క్సు, ఫ్రెడెరిక్ ఎంగెల్స్'. అయితే మార్క్సుకు విజయాన్ని ఆస్వాదించే అవకాశం కలుగలేదు. ప్రత్యర్థులను చిత్తుగా ఓడించాడేగాని, ఒక శత్రు సైన్యమే తయారైంది (వీళ్లు మానిఫెస్టోను 'రియాక్షనరీ' అన్నారు). మరికొద్ది రోజులకే ఎంగెల్స్ మాంచెస్టర్ వెళ్లిపోయాడు ఇప్పుడు మార్క్సుకు కొద్ది మంది యువకులు తప్ప తోడు లేరు. మేధోపరంగా తను చర్చించగలిగింది జెన్నీతో మాత్రమే. మాజీ కమ్యూనిస్ట్ లీగ్ ప్రత్యర్థుల దాడులను ఒంటరిగా ఎదుర్కోవాల్సిందే. ఆర్థిక సమస్యలు కొనసాగుతూనే వున్నాయి. అక్టోబర్‌లో, జెన్నీ ఫ్రాంక్‌ఫర్ట్‌లో తాకట్టుపెట్టిన వెండిని అమ్మి డబ్బు పంపమని లైడెమియర్‌కు రాశాడు మార్క్సు. ఇది అత్యవసరం. ఒక మగ్, పళ్లెం, కత్తి తప్ప మిగతావన్నీ తక్షణం అమ్మెయ్యాలి (ఈ వస్తువులు తన అయిదున్నర ఏళ్ల జెన్నీ చెన్వి) .

పిల్లలే మార్క్సు జీవితంలో వెలుగులు. దేశాలు మారటం, ఇళ్లు మారటం, చలి, ఆకలి, భాష తెలియని కొత్త వూరు ఇలా ఎన్ని సమస్యలున్నా ' పిల్లలు చలాకీగా ఆడుతూ పాడుతూ వున్నారు' అంది జెన్నీ. కాస్త బొద్దుగా వుండే మూడేళ్ల ఎడ్గార్ తన కోతి చేష్టలతో అదన్నీ నవ్విస్తారు. గొంతు చించుకొని తమాషా పాటలు పాడతాడు రోజంతా. ఫైల్‌గ్రాత్ రాసిన 'మార్సె ' నుండి వాడు ' కమ్, ఓ, మూన్' అనే పాట అందుకున్నాడంటే యిల్లు మార్మోగిపోతుంది.

పుట్టినప్పటి నుండే జబ్బుగా వున్న పిల్లాడు గుయిడో. అయితే వాడు ఎక్కువకాలం బాధపడ లేదు. నవంబర్ 19 నాడు న్యుమోనియా ముదిరి నాల్గవ పుట్టిన రోజు తర్వాత తుది శ్వాస విడిచాడు. 'బుల్లి మందుగుండు కుట్రదారుడు' అనేవాళ్లు వాణ్ణి అందరూ. ఈ కుట్రదారు మరణించాడని ఎంగెల్స్‌కు రాశాడు మార్క్సు. 'అప్పటిదాకా నవ్వుతూనే వున్నాడు. మమ్మల్ని నవ్విస్తూనే వున్నాడు. మా పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోగలవు. నువ్వు లేకపోవడంతో ఒంటరిగా వున్నట్టుంది'. నాలుగురోజల తర్వాత 'జెన్నీ చూస్తే ఆందోళనగా వుంది. స్వయంగా పిల్లాడికి పాలిచ్చి పెంచింది. చివరి క్షణం దాకా వాడికోసం శాయశక్తులా పోరాడింది. ఆమె త్యాగానికి యిదా ఫలం? ' అంటూ వాపోయాడు.

పుట్టినప్పటి నుండే జబ్బుగా వున్న పిల్లాడు గుయిడో. అయితే వాడు ఎక్కువకాలం బాధపడ లేదు. నవంబర్ 19 నాడు న్యుమోనియా ముదిరి నాల్గవ పుట్టిన రోజు తర్వాత తుది శ్వాస విడిచాడు. 'బుల్లి మందుగుండు కుట్రదారుడు' అనేవాళ్లు వాణ్ణి అందరూ. ఈ కుట్రదారు మరణించాడని ఎంగెల్స్‌కు రాశాడు మార్క్సు. 'అప్పటిదాకా నవ్వుతూనే వున్నాడు. మమ్మల్ని నవ్విస్తూనే వున్నాడు. మా పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోగలవు.

గుయిడోను టోటెన్ హాం కోర్ట్ రోడ్‌లోని శ్మశాన వాటికలో నమాధి చేశారు. ఆ చిన్న శవపేటికతో ఎక్కువ దూరం నడవాల్సిన అవసరం లేకపోయింది. శరణార్థులతో బిలబిలలాడే సోహో ప్రాంతంలో మరణాలు సాధారణ దృశ్యమే. శవపేటికతో మార్క్సు కుటుంబం నడిచినప్పుడు బహుశా ఎవరూ వాళ్లను గుర్తించి వుండకపోవచ్చు. ఈ 'ఎవరూ పట్టించుకోని తనం' వాళ్ల విషాదాన్ని మరింత పెంచుతుంది. కాని పేదల బస్తీలో వుంటున్న నిరుపేదలు వాళ్లు. నాలుగడుగుల కావలే వుంటాయి కోటీశ్వరుల మేడలూ మిద్దెలూ.

లండన్, చలికాలం, 1851

పెరుగుతున్న సంపదతో బూర్జువా సంబంధాలతో సాధ్యమైనంత ఎక్కువగా వుత్పత్తి శక్తులు కూడా పెరుగుతున్నప్పుడు నిజమైన విప్లవం గురించి మాట్లాడటం అనవసరం.

- కార్ల్‌మార్క్సు, ఫ్రెడెరిక్ ఎంగెల్స్

1851లో, అందరికీ శాంతీ, సంపద లక్ష్యంగా తన భర్త మొత్తం ప్రపంచాన్నే సమైక్యం చేశాడని గర్వంగా ప్రకటించింది. విక్టోరియా మహారాణి ఆమె భర్త ఆల్బర్ట్ ప్రపంచంలోని మహా ప్రదర్శన (గ్రేట్ ఎగ్జిబిషన్)ను ఏర్పాటు చేసిన ప్రముఖుల సంఘానికి అధ్యక్షుడు. మే 1 నాడు వాణిజ్యం, పారిశ్రామిక వుత్పత్తులు, ఆవిష్కరణలను ఒక చోట ప్రదర్శిస్తూ ప్రారంభమైంది గ్రేట్ ఎగ్జిబిషన్. లండన్‌లోని నాల్గవ వంతు జనం ఈ ప్రదర్శనను చూడటానికి హైడ్ పార్క్‌లో గుమిగుడారు. ఈ శాస్త్ర సాంకేతిక అద్భుతాన్ని చూసి ఆనందించటానికి ముప్పైరెండేళ్ల మహారాణి కూడా వచ్చేసింది.

(సశేషం)

2004లో సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన ఇల్ఫ్రీడే ఇయెలినెక్ కవయిత్రి, నటి, నాటక నవలా రచయిత్రి, జర్మన్ భాషలో రాసే ఆస్ట్రియన్ నివాసి. సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన పదవ మహిళ. మొదటి ఆస్ట్రియా మహిళ కూడా.

ఏకాంతవాసం ఆమె కవిత్వానికి ప్రేరణ

ఇల్ఫ్రీడే తండ్రి ఇయెలినెక్ (1900–1969) రసాయన శాస్త్రజ్ఞుడు, జెకొస్లవేకియా వాసి. యూదు కావడంతో రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో మారణహోమంలో నాజీల మూలంగా అనేకమంది కుటుంబ సభ్యులు పోగొట్టుకున్నారు. నాజీల బారి నుండి తప్పించుకునేందుకు ముఖ్యమైన పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రాల్లో పనిచేసారు. రుమానియన్ జర్మన్ తల్లి, ఓల్గా ఇలోనా ఇయెలినెక్ భాగ్యవంతులైన కేథలిక్ వియానా కుటుంబం నుంచి వచ్చింది. మ్యుర్జుస్లుగ్, స్ట్రియా, ఆస్ట్రియాలో ఇల్ఫ్రీడే జన్మించింది. తల్లిదండ్రుకు ఆమె ఏకైక సంతానం. ఆమె పుట్టినపుడు తండ్రి వయస్సు 46, తల్లి వయస్సు 42. ఉన్నత వర్గానికి చెందిన వారిగా తల్లిదండ్రులుండేవారు.

చదువుతో పాటు, కూతుర్ని వియానాలో ఒక ప్రసిద్ధ సంగీతకారిణి చేయాలన్న ఆశయం తల్లిది. ఆ తలంపుతో ఉన్న తల్లి కఠినమైన వైఖరితో ఇల్ఫ్రీడే పెరిగింది. మరీ బాల్యంలో బాలే నాట్యం, ఆరేళ్ల ప్రాయం నుంచి సంగీత శిక్షణ కోసం పంపేది. ఉదయం ఆరింటికి లేచి ఒక గంట సంగీత సాధన చేయాలి. ఆ తరువాత స్కూలుకు పోవాలి. మధ్యాహ్నం స్కూలు నుంచి వచ్చి సంగీతం నేర్చుకునేందుకు వెళ్ళాలి. అక్కడి నుంచి వచ్చాక స్కూలు హోం వర్కు పూర్తి చేసుకుని, మళ్ళీ సంగీత సాధన చేయాలి. ఆ సాధన కూడా, ఇంటిలో తెరిచిన కిటికీ దగ్గర కూర్చుని చేయాలి. వీధిలో అందరూ అది గమనించి ఆమెను మెచ్చుకోవాలి అని తల్లి భావించేది. బాల్యం నుండీ నెమ్మదితనం, సంకోచం ఇల్ఫ్రీడే కు ఎక్కువ. ఆ ఈడు పిల్లలలో ఉండే గుణాలేవీ ఆమెకు ఉండేవి కావు. చదువులోను సంగీతంలోను తతిమా పిల్లల కంటే ఉన్నతంగా ఉన్నా, ఏ పిల్లలూ తన బిడ్డకు సాటిరారన్న ధోరణిలో ఆమె తల్లి ఉండేది. 1960లో ఆమె పద్నాలుగేళ్ల వయసులో వియానాలోని పేరొందిన సంగీత శాలలో చేర్పించి, పియానో, అర్గాన్, గిటార్, ఫిడేలు, వీణ మొదలైన వాయిద్యాలను నేర్పించింది. ఆ సంగీత సాధనలోనే దాదాపు 11 ఏళ్ల ఆమె జీవితం గడిచిపోయింది. స్త్రీల శరీరం వాయిద్యంలా తయారుకావడం విషాదం అని, ఆ తరువాత ఆమె రాసుకుంది.

వియానాలోనే ఇల్ఫ్రీడే పెరిగింది. 1964లో వియానా విశ్వవిద్యాలయంలో నాటకరంగం, కళాచరిత్ర అభ్యసించడానికి చేరినా, కొన్ని నెలల తరువాత ఆ చదువు కొనసాగించలేక పోయింది. దానికి కారణం తల్లిదండ్రుల మధ్య విపరీతమైన ఉద్రిక్తతలుండేవి. ఫలితంగా తండ్రి మానసిక ఆరోగ్యకేంద్రంలో ఉండాల్సి వచ్చింది. దానికి తోడు ఒకవైపు చదువు మరోవైపు కఠినమైన సంగీత శిక్షణతో 17 ఏళ్ల ప్రాయంలో తీవ్రమైన ఆరాటం, మనోవికారానికి లోనయింది. బాల్యం నుండీ ఏకాంత వాసం ఆమె స్వభావంగా మారితే, కొన్ని ఆమె ఏకాంతవాసానికి మరింత కారణాలయాయి. మానసిక నరాల వ్యాధి మూలంగా 1968 సంవత్సరం పూర్తిగా తల్లిదండ్రుల ఇంటిలో, ఆ ఏకాంతవాసంలోనే గడపాల్సి వచ్చింది. 1969లో తండ్రి ఆ మానసిక ఆరోగ్య కేంద్రంలోనే మరణించాడు. ఏకాంతవాసం నుంచి, మానసిక అవస్థల నుంచి కోలుకునే సమయంలోనే, ఇల్ఫ్రీడేకు ఆత్మశోధన మొదలయింది. తనను తాను వ్యక్తీకరించుకునేందుకు రచనని ఒక సాధనంగా చేసుకుందామె. 1967లో ూఅయ్యిం ఒష్ట్రుఒశీష కవిత్వ సంకలనంతో, సాహిత్య రంగ ప్రవేశం చేసింది. అలా 21 ఏళ్ల ప్రాయంలో 1967లో ఆమె మొదట ప్రచురించింది కవిత్వ సంకలనమే. కేవలం వస్తువు కాదు అందులో భాష ఎక్కువగా మాటాడాలి అన్నది ఆమె అభిప్రాయం. ఆ పరిస్థితుల్లోనే ఆమె విద్యార్థి ఉద్యమాల్లో చేరింది. ఆమె ఆందోళనల వెనక ఆమె నేపథ్యం ఉంది. విద్యార్థి ఉద్యమంలో పూర్తిగా లీనమయింది. రేడియో నాటకాలు నవలలు రాసే పనిలో పడింది. 1970లో ఆమె మొదటి నవల ఔఓష్ణతీవ ఐవఏశీఎం, దీుఎఎ! వచ్చింది. విద్యార్థి ఉద్య మంతో సాన్నిహిత్యం ఏర్పడి వ్యవహారరీత్యా, స్త్రీ వాదిగా, సమాజాన్ని విమర్శనాత్మక దృష్టితో చూడడంలో ఆమె నిమగ్నమైంది. సంగీతంలో తీవ్ర సాధన చేసి 1971లో – చాలా మంచి మార్కులతో సంగీతంలో పట్టభద్రురాలయింది. ఆ తరువాత బెర్లిన్, రోమ్ యాత్రలతో ఆమెలో రాయాలనే ఉత్సాహం ఉరకలు వేసింది. తొలి నవలలు ప్రయోగాత్మకంగా ఉండేవి. విద్యార్థి ఉద్యమంలో చేరాక ఇల్ఫ్రీడే రచనల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 1972లో వచ్చిన Michael: A Young Person's Guide to Infantile Society నవల ఆమె మానసిక పరిస్థితి కుదుటపడ్డాక రాసిన మొదటి నవల. అది విమర్శకుల మన్ననలు పొందింది.

ఇల్ఫ్రీడే 1974లో, గోట్ఫ్రీడ్ హంగ్స్బెర్గ్ (1984–) ను వివాహం చేసుకుంది. అప్పట్లో అతను జర్మనీ ప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు రైనర్ వెర్నర్ ఫస్బిండర్ తీసిన చలన చిత్రాల్లో సంగీత దర్శకుడుగా పనిచేసాడు.

కానీ 1970 నుండీ అతను మ్యూనిక్‌లో సమాచార సాంకేతిక విభాగంలో ఉన్నాడు. 1974లోనే ఆమె కమ్యూనిస్ట్ పార్టీలో చేరింది. 1991 వరకూ అందులో కొనసాగింది. 1974లోనే ఆమె మొదటి రేడియో నాటకం వచ్చింది. ఆ ఏడాది అది అత్యంత ప్రజాదరణ పొందింది. 1975లో వచ్చిన women As Lovers, 1980లో వచ్చిన Wonderful, Wonderful Times నవలలతో జర్మనీ పాఠకుల అభినందనలు ఇల్ఫ్రీడే అమితంగా పొందింది. కవితలు, వ్యాసాలు, నాటకాలు విస్తారంగా రాయడం కూడా ఎక్కువైంది. ఆమె నవలల వస్తువులే నాటకాలలో కూడా ఉండి, కాపిటలిస్టు వ్యవస్థలోని అవకతవకలు, స్త్రీలను తక్కువ చేయటం మీద ఆమె ధ్యాస ఎక్కువగా అందులో కనిపిస్తుంది. భర్త మూలంగా రెండవ గృహమయిన జర్మనీలో ఆమె అవార్డుల పంట పండింది. ఆస్ట్రియాలో ఆమె పట్ల మిశ్రమ అభిప్రాయాలున్నాయి. నాజీలను సమర్ధించినా యుద్ధానంతరం వెంటనే పునరావాసం పొందగలిగిన, 20వ శతాబ్దపు ప్రముఖ రంగస్థల నటి పౌలా వెస్లీ జీవితం ఆధారంగా ఆమె రాసిన ప్రహసనం, అనేక దూషణలకు గురయింది. 2001లో రాసిన నాటకం Bambiland ఇరాక్ యుద్ధం మీద పరుషమైన దాడి.

సాంప్రదాయక సాహిత్య రచనా పద్ధతిని తిరస్కరించి, భాషా ప్రతిపాదిక ప్రయోగాల వైపు మొగ్గు చూపించింది ఇల్ఫ్రీడే. ఆమెకు పేరు తెచ్చిన నాటకాలలో – 1980లో What Happened After Nora Left Her Husband, 1984లో Claras, 2003లో Bambiland ముఖ్యమైనవి. వివాదాత్మక స్త్రీ వాదిగా 1975లో రచించిన 'ఉమెన్ యాజ్ లవర్' నవల, ఆమె స్వీయ చరిత్రగా తలపించే 'ది పియానో టీచర్' (1983) నవలలు సాహిత్య ప్రపంచంలో సంచలనం సృష్టించాయి. వివాదాత్మక స్త్రీవాదిగా పేరొందారు. ది పియానో టీచర్ (2001) చిత్రంకేన్స్ గ్రాండ్ జ్యూరీ అవార్డు పొందింది. మూడు ముఖ్యమైన బహుమతులు గెలుచుకుంది. ఒక పియానో శిక్షకురాలు ఎరికా, తనక సంగీత విద్యార్థి అయిన యువకునితో జరిపిన నాటకీయ వ్యవహారం అందులో స్థూలంగా కథా వస్తువు. ఆమె రచించిన ఇతర నవలలకు కూడా మంచి గుర్తింపు లభించింది. జర్మనీలో ఆమె నవలలు ఒక్కొక్కటి పదివేల ప్రతులకంటే ఎక్కువగా అమ్ముడవుతాయి. వాటి ఆంగ్ల అనువాదాలు బ్రిటన్ లాంటి దేశాల్లో కేవలం వందల సంఖ్యలోనే అమ్ముడవుతాయి. బలహీనుల పక్షానే తాను ఉండి రాయడానికి ప్రయత్నం చేస్తానని, శక్తివంతమైన వారి పక్షం తీసుకోవడం తన దృక్పథం కాదని ఆమె చెప్పేవారు.

స్త్రీ పురుష సంబంధాల పట్ల స్పష్టమైన దృక్పథంతో రచనలు చేశారు. పురుషులు స్త్రీల మధ్య సంబంధాలు, యజమానులు బానిసల లాంటివని, ఎక్కడైతే స్త్రీలు తమ యవ్వనం, అందం, దేహం మూలంగానే కేవలం శక్తిమంతులుగా చూడబడతారో, పురుషులు తమ పని, కీర్తి లేదా సంపద ద్వారా తమ లైంగిక విలువల్ని పెంచుకుంటారో, అక్కడ ఏ మార్పూ ఉండదని ఆమె చెప్పేవారు. పేరొచ్చిన స్త్రీలు తమను తాము తక్కువ చేసుకోకుండా లొంగకుండా ఉంటే, అటువంటి వారిని చూసి పురుషులు కూడా భయపడతారని ఆమె నమ్మకం.

తనకు నోబెల్ బహుమతి రావడం ఆస్ట్రియాకు జాతీయ విజయోత్సవం కాదని, వారి గుండీలకు అలంకారంగా ఉంచుకునే పువ్వు కాదని ఆమె భావించింది. సామాజిక భయంతో నోబెల్ బహుమతి స్వీకారానికి, స్టాక్ హోంకు కూడా పోలేదు. 2004లో వచ్చిన నోబెల్ బహుమతితో బాటు అనేక ముఖ్యమైన అవార్డులు ఆమెకు లభించాయి.

ఇప్పటి వరకు ఇల్ఫ్రీడే రాసిన రచనల్ని మూడు దశలుగా విమర్శకులు విభజిస్తారు.

ఎక్కడైతే స్త్రీలు తమ యవ్వనం, అందం, దేహం మూలంగానే కేవలం శక్తిమంతులుగా చూడబడతారో, పురుషులు తమ పని, కీర్తి లేదా సంపద ద్వారా తమ లైంగిక విలువల్ని పెంచుకుంటారో, అక్కడ ఏ మార్పూ ఉండదని ఆమె చెప్పేవారు.

1– ఆమె తొలి రచనలు– అందులో పెట్టుబడిదారీ విధానాన్ని, వినిమయ సమాజాన్ని విమర్శించడం కనిపిస్తుంది.

2– 1980 ప్రాంతంలో పితృక్రమానుగత సమాజం మీద ఏవగింపు కనిపిస్తుంది.

3– 1980 నుండీ ఆస్ట్రియా, జర్మనీలో గతంలోని నియంతృత్వ ధోరణుల్ని తూర్పార బెట్టడం చూడొచ్చు.

తన కాలంలో జరుగుతున్న, జరిగిన విషయాల మీద ఇల్ఫ్రీడే కు గొప్ప అవగాహన, సూక్ష్మ గ్రాహ్యత ఉంది. కార్మిక యువతులు, డెబ్బయి దశకంలోని అరాజకత్వం, బెర్లిన్ గోడ పరిణామాలు, జర్మనీ దేశీయత మొదలైన అనేక విషయాలు ఆమె రచనలకు ఇతివృత్తాలు. ఇరాక్‌పై అమెరికా యుద్ధాని కూడా వ్యతిరేకించి సామ్రాజ్యవాద వ్యతిరేకతను ప్రదర్శించారు. దీనిపై విమర్శలు వచ్చినా తట్టుకొని నిలబడటం ఆమె సృజనాత్మక నిబద్ధతకు సంకేతం. అందువల్లనే నోబెల్ రచయిత్రిగానే కాదు, సామ్రాజ్యవాద దుర్మార్గాన్ని వ్యతిరేకించడం ద్వారానూ సాహిత్య ప్రపంచంలో మంచి గుర్తింపు లభించింది.

– ముకుంద రామారావు, 9908347273

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహా పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20

■ స్మృతి పథంలో...

పీసు మామిడి చెట్టు

వళ్ళు చూడ్డానికి బాగానే వుంది నిగనిగలాడుతూ, మరీ మనస్సుకేమయిందో తెలిసి చావడం లేదు.

ఇన్నేండ్లు బేఫర్వాగానే గడిచిపోయాయి. మరిప్పుడేమయిందో- ఏవేవో ఆలోచనలు. గడిచిపోయిన రోజులు- కలిసి తిరిగిన సావాసగాళ్ళు, ఎగిరెగిరి ఆడుకున్న ఆట స్థలాలు- కోతి కొమ్మచ్చి ఆడుకున్న చెట్టూ చేమలూ- బడెగ్గొట్టి నడి ఎండాకాలంలో ఈతలు-ఆ బావులూ- ఊరిచుట్టుపట్ల ఉన్న పది పన్నెండు చిన్న చిన్న బోళ్ళూ, జీల్ జీల్ బండ, గుట్టలూ-సీతాఫలాల కోసం తిరిగి తిరిగి- అలా బడి ఎగ్గొట్టినందుకు పంతుళ్లతో- చప్రాసీలతో దెబ్బలు- దెబ్బలన్న దెబ్బలా - పుట్టించిన దేవుడడ్డం వచ్చినా వదలని పంతుళ్ళు- నాతోపాటు చదువుకున్న చిన్ననాటి మిత్రులూ, ఆర్థిక పరిస్థితి బాగోలేక కూలినాలి చేసుకుంటూ బతుకులీడుస్తున్న, కల్మషమంటే తెలియని ఆనాటి మిత్రుల ఈనాటి వికృతపోకళ్ళు- జీవితపు ప్రతిదశలో పరిచయమైన మిత్రులూ- అంతకుముందే దగ్గరి బంధువులూ, ఒక్కొక్కరే తెరమరుగవడం- ఒక్కొక్కరిదీ ఒక్కో జ్ఞాపకం ! ఎవరినీ తీసివేయలేను. అందరూ కావాల్సిన వాళ్లే. నిత్యం ఇలా ఎందరో జ్ఞాపకానికి వస్తూ పోతూ ఉంటారు. ఇవే ఆలోచనలు ముసురుతుండడంతో రోజంతా గడపడం దుర్భరంగా ఉంటుంది.



మా తాతయ్య తరం నుండీ నా తరం వరకూ కొనసాగిన మా జీతగాళ్ళూ, నాట్లు వేసిన కూలీలు, మేస్త్రీలు, మా కుటుంబంతో అనుబంధం ఉన్న ఎందరో, నా కనుల ముందే ఈ లోకం విడిచిపోయారు. వీరిలో కొంతమందిని, నేను కొంచెం శ్రద్ధ చేసి ఉంటే- మరికొంత కాలం బతికి ఉండేవాళ్లు కదా అనిపిస్తుంది. వీరందరూ నన్నభిమానించిన వాళ్లే.

వీరిలో చాలా మందికి ఖమ్మం డాక్టరు వద్దకు పోడానికి భయం. వారి ఎడల నేను కొంచెం శ్రద్ధ చేసి ఉంటే బావుండేదేమో అనిపిస్తుంది. మరికొంతమందైతే-అతి పిన్న వయస్సులో- చేతిలో డబ్బాడక-తన వారందరినీ వదిలి పరలోకగతులై పోయారు.

నన్నభిమానించి-నన్ననుసరించిన మరికొంతమంది పెద్దలూ-పిన్నలు కూడా, నేను చూస్తుండగానే కనుమరుగైపోయారు. తమ్ముడూ తమ్ముడూ అంటూ పిలిచే నా వాళ్లందరేరీ ? వీరందరూ మరికొంత కాలం బతికుంటే బాగుండేదని-ఊరింతగా పాడుపడి పొయ్యేది కాదని ఇప్పుడనుకుంటున్నాను. వీరందరూ చిన్న చిన్న జబ్బులతోనే రాలిపోయారు. నేను వారి ఎడల మరికొంత శ్రద్ధ తీసుకోవాల్సింది. నా గురించి నా అసమర్థతను గురించి వారేమనుకున్నారో!- వారి ఆఖరు ఘడియల్లో. బాధతో, కోపంతో వారు నన్ను శపించి ఉండరు. నా చేతగానితనానికి కొంత బాధపడి వుంటారు. నా స్థోమత వారికి తెలియనిది కనుకనా!

గడిచిన జీవితంలో ఎందరో పరిచయస్థులు-బాల్యమిత్రులూ, మావూరి అనేక కులాల వాళ్లు అనేక మందిలో కొద్దిమంది తరచుగా గుర్తుకు వస్తుండడంతో నిద్రపట్టని రాత్రుళ్ళతో సహవాసం అలవాటయిపోయింది. నా జ్ఞాపకాలు తరచుగా- నన్నొదిలిపోయిన వారి గురించే, నా ఆలోచనలు తీగల్లా సాగడం నన్ను పిచ్చివాణ్ణి చేస్తున్నాయి.

పై వారందరితో పాటు నిత్యం జ్ఞాపకానికి వచ్చేది పీసు మామిడి చెట్టు. ఈ చెట్టు మా స్వంతమేమీ కాదు-యాదవులది. యాదవులు దాన్ని ఊరందరిదీచెట్టనే భావించేవారనుకుంటాను. ఆ చెట్టెంత పెద్దదంటే అరెకరం నీడ కలిపించేది. ఆ నీడ వల్ల అక్కడింకో పంట పండదు. ఆ చెట్టు కాయలని- పండు చీకని వాళ్ళెవరూ ఊళ్ళో లేరంటే అతిశయోక్తి కాదు.

రాత్రిళ్ల చందమామ కథల్లో కనిపించే ఒంటికన్ను రాక్షసుడిలావుండేదాచెట్టు. పగలు ఆ చెట్టంటే భయమేసేదే కాదు. ఇంతింతిలావు కొమ్మలు, వయస్సులో గుబురుగా ఉండేదేమో! వందేళ్ల పైబడిన చెట్టది. వయస్సు మీద పడడంతో ఆకులు-కొమ్మలు పలచబడి లెక్కపెట్టడానికి వీలైనన్ని కొమ్మలు మాత్రమే ఉండేవి. కాలంలో ఎంత మార్పు?

ఎప్పుడు ఆటవిడుపు దొరికినా ఆ చెట్టుపైనే కోతి కొమ్మచ్చి ఆడేవాళ్లం.

వేసవికాలం వచ్చిందంటే చాలు ! మా ఊరి పిల్లలమంతా ఆ చెట్టు వద్దే మకాం. చెట్టంతా పళ్ళే. మగ్గపండిన పళ్ళు- బంగారు రంగులో ఉండి నోట్లో నీరూరించేవి.

సాయంత్రం చల్లబడిందంటే చాలు-పూసలోళ్ల బావిలో ఈతలు-కేరింతలు-మొగ్గలు వేయడాలు-నవ్వుకోవడాలు- చిటికెలతో కోడిపుంజు ఆటలు- ఎన్నో! ఇప్పుడా పూసలోళ్ల బావి అప్పుక్రింద ఊడ్చుకుపోయింది. ఈతకు పోతున్నప్పుడల్లా ఈ పీసు మామిడి చెట్టు క్రింది నుంచే పోయేవాళ్లం. అయిదారు నిమిషాలు ఓపికపడితే చాలు- ఏ కొమ్మనుండో ఓ కొమ్మనుండి టప్ మని ఓ పండు రాలిపోయేది. ఆ పండుకోసం మా పరుగులు. మాలో ఎవరో ఒకరికి దొరికేదా పండు. అలా పరుగెత్తడంలో ఒకరినొకరు తోసుకోవడాలు-దెబ్బలు తగలడం- తిట్టుకోవడం-అంతలోనే నవ్వు, భాయ్ భాయ్. ఆ పండుకోసం మాలో మాకే ఎన్నో గొడవలు.

ఎండాకాలం సెలవుల్లో మేమూ, స్నేహితులందరూ మా మిద్దెమీదనే పడుకునేవాళ్లం. ఏ అర్ధరాత్రో చల్లటి గాలి వీచేది. అలా గాలి వీచిందో లేదో- పీసు మామిడి చెట్టుకిందన్నీ పళ్లే. రాత్రిపూట ప్రతిరోజూ నలభై ఏభై పండ్లు రాల్చేదా చెట్టు.

ఎద్దెగోడదూకి- మా పెద్దోరి గోడ దూకి పీసు మామిడి కిందికి ఉరికే వాళ్లం. నిద్రంతా ఎటుపోయేదో! ఆ నిద్ర మొహంతోనే పండు చీకడం-చేతివెంట కారిందంతా నాకడం- పండును పిసికి పిసికి రసాన్ని జుర్రడం, ఎంత బావుండేది ఆ చీకడం.

మనకంటే నోరులేని చెట్టేనయం!

అడుక్కునే వాళ్ళు సైతం ఈ మామిడి చెట్టుకింద గుడిసెలు వేసుకునే వాళ్ళు. అలా వచ్చే వారిలో గారడివాళ్ళూ, శారదకాండ్లు, గంగిరెద్దుల వాళ్ళు- పగటి వేషగాళ్ళు-డక్కలివాండ్లు-చిందులోళ్లు-పిచ్చకుంట్లు, కాటికాపరోళ్ళు ఇలా ఎందరో ఇక్కడే -తమ జీవితంలో కొంత భాగాన్ని గడిపి వెళ్లిపోయేవాళ్ళు.

అలా వచ్చిన అనేకులు గుడిసెలు వేసుకొని, పదిరవయి రోజులుండి మరెటో వెళ్ళిపోయేవాళ్ళు. వారివెంట కుక్కలూ, గాడిదలు, పెంపుడు కోతులూ, పిట్టలూ ఇలా ఏవేవో. వాటితో పాటు వారి పిల్లలూ, ఆడవాళ్ళ, వారి పరివారం అంతా ఓ చిన్న వూరిలా వుండేది పీసు మామిడి నీడన.

అలా వచ్చిన వారి పిల్లలు మామిడి కొమ్మలకు తాళ్ళ కట్టి ఉయ్యాలలూగడం చూస్తుంటే మాకూ, అలా, వాళ్ల ఉయ్యాల్ల మీద ఊగాలనిపించేది.

అప్పుడప్పుడూ యాదవులను అడుక్కునేవాళ్ళు గూడా వచ్చి పీసుమామిడి చెట్టుకిందే మకాం వేసేవాళ్ళు. వారి వెంట తట్టు గుర్రాలు కూడా ఉండేవి. ఆ గుర్రాలపై వారి పిల్లలు ఎక్కి స్వారీ చేయడం చూస్తున్నప్పుడు నా మనస్సు అదోలా అయిపోయేది. మా మేనమావల గుర్రాలు ఎక్కి తిరిగినా, ఎందుకో ఈ తట్టు గుర్రాల్ని గూడా ఎక్కి తిరగాలనిపించేది. ఇవి ఉరకవు. కింద పడిపోతామనే భయం లేదు. ఇంత వరకు నా తీరని కోరికల్లో గాడిదనెక్కి వురికించడం. అది కలగానే ఉండిపోయింది.

అప్పుడప్పుడు అనేక రకాల సర్వేవాళ్ళు వచ్చి అక్కడే మకాం వేసేవారు టెంట్లతో సహా. మాదిగవాళ్ళ పంచాయతీలు అప్పుడప్పుడూ అక్కడ జరుగుతుండేవి. విడాకులు ఊరి బయట జరిగినా పంచాయతీ మటుకు ఈ చెట్టుక్రిందే జరిగేది. మా ఊరివాళ్ల వివాహాలప్పుడు జరిగే ఎదుర్కోళ్ళు ఈ చెట్టు క్రిందే జరిగేవి. పెళ్ళి కొడుక్కూ, వారి బంధువులకూ పానకం ఇచ్చి పిల్లవాణ్ణి విడిదింటికి తీసుకుని వచ్చేవాళ్ళు. ఇక్కడే వడ్ల బత్తులు బండి పట్టాలు వేస్తుండడంతో చూడ్డానికి దగ్గరికి వెళ్లినప్పుడు వడ్లబత్తులు మా పిల్లల్ని గెదమడం మాకు సరదాగా ఉండేది.

మా పిల్లలకు పీసు మామిడి చెట్టంటే ఉన్న ప్రేమ, కట్టమీది మర్రిచెట్టు ఎడలగానీ, జువ్విచెట్టు ఎడల గానీ, జోడు చింతల పట్ల గాని ఉండేది కాదు.

మర్రిచెట్టు క్రింద ఓ కుటుంబానికి కుటుంబం ఆత్మహత్య చేసుకుంటే, వారిని ఈ చెట్టుక్రిందే పండబెట్టారు. అదీ మా భయం.

జువ్వి చెట్టు మీద కొరివి దయ్యాలున్నాయని మా జీతగాళ్ళు భయపెట్టేవాళ్ళు. ఆ భయం ఇంత వరకూ పోనేపోలేదు. జోడు చింతల మీద వట్టి దయ్యాలుంటాయనే వాళ్ళు. అందుకే ఈ చెట్లంటే మాకోరకమైన భయం.

సుడిగాలులు వస్తున్నప్పుడు పసుపు-కుంకుమ తీసుకుని సుడిగాల్లోకి విసిరేవాళ్ళం. అలా దయ్యాలను చూడాలని అనుకునేవాళ్ళం. అలా చేస్తే దయ్యాలు కనపడుతాయని అనుకునేవాళ్ళు.

కానీ, పీసు మామిడి చెట్టంటే చిన్న పిల్లవాళ్లకు కూడా ప్రేమాభిమానాలుండేవి. అసలు ఆ చెట్టును చూసి భయపడ్డవాళ్ళొక్కరూలేరు.

ఇన్ని సంవత్సరాలు గడిచాక వెనుతిరిగి చూస్తే మాకు మిగిల్లిందల్లా- పీసుమామిడి చెట్టు జ్ఞాపకాలే! ఎన్ని వేల మంది ఆ చెట్టు పళ్లను తినివుంటారో. మరెన్ని వందల మంది పండ్లకోసం ఆ చెట్టుపైకి రాయి విసిరారో. అలా వాళ్ళు విసిరిన రాళ్లలో ఇద్దరు ఇప్పటికీ నాకు గుర్తే. వారిలో ఒకరు అబ్బయ్య మామ. వాడిదెంత గురి. ఫలానా పండు కావాలంటే చాలు. కచ్చితంగా అదే పండును రాలుస్తాడు.

ఇంకోడు మాదిగవాళ్ల అబ్బాయి. నేనయిదారేండ్ల క్రిందోసారి, పప్పులోకి కావాలని పీసుమామిడి చెట్టు దగ్గరికెళ్లాను. ఇది మా యింటికి దగ్గర్లో ఉంది. నా చిన్నప్పటి స్నేహితులు, ఈ చెట్టు మా ఇంటికి దగ్గర్లో ఉందని ఈర్ష్య చెందేవారు. చెట్టువద్దో మాదిగవాళ్లబ్బాయి ఉన్నాడు. నువ్వెవరి అబ్బాయివి అన్నాను. వెంకులు కొడుకునన్నాడు. వెంకులు మా పాత జీతగాడే; గనుక ఒరేయ్ నాలుగు కాయలు పప్పులోకి కావాలి, చెట్టెక్కి కోయమన్నాను.

నేనెక్కనన్నాడు వాడు.

అదేమిటిరా అంటే- చెట్టెక్కను సార్ కాలుజారుతుంది. మీకు కావాల్సింది కాయలేగదా అన్నాడు. ఔనన్నాను.

కర్రతో రాలగొడ్తానన్నాడు. పగిలిపోతాయి- మట్టిలో పడ్తాయి గదా అన్నాను.

పగలకుండా, మట్టిలో పడకుండా మీక్కావలసిన కాయలిస్తానన్నాడు.

అదేలా ?

మూరెడు కర్ర ముక్కను పైకి విసిరాడు కాయలకు గురిచూసి, అంతే ! ఓ కాయ తెగి భూమిమీదకు వస్తూనే ఉంది. ఉరికి అందుకున్నాడు. దాన్ని క్రింద పడనీయకుండా. అలా నాలుగుకాయలూ- కిందపడకుండానే కర్రముక్కతో కొట్టిపెట్టాడు. నాకు అబ్బురమేసింది.

ఒరేయ్ ! నా వెంట రా. హైదరాబాద్‌లో విక్టరీ ప్లేగ్రౌండుంది. అందులో ఆడుకునే పిల్లలకు పరిచయం చేస్తాను. క్రికెట్టు నేర్చుకుందువు. నువ్వు గొప్ప ఫీల్డరువవుతావు.

వాడన్నాడు; నేను మా అమ్మకు ఒక్కణ్ణే సార్. నేను మీ వెంట వస్తే మా వాళ్లనెవరు చూస్తారు?

తల తిరిగింది. వాడి జవాబు విని మ్రాన్పడిపోయాను. మాదిగ పిల్లవాడికి వున్నంత తెలివి, పరిజ్ఞానం పెద్ద కులాల వాళ్లకు లేకపోయెనే అనిపించింది. ఇప్పుడా పిల్లోడు చదువొదిలేసి ఊళ్ళోనే కూలి పనులకు పోతున్నాడు. వాడు నే చెప్పినట్లు విని ఉంటే కచ్చితంగా వెస్టిండీసు ప్లేయర్సులా- వీడూ హైదరాబాద్‌లో టెస్ట్ క్రికెటర్‌లా తయారయ్యేవాడు.

ఇన్ని జ్ఞాపకాల్ని మిగిల్చిన ఆ పీసు మామిడి చెట్టేది ? ఏమైంది?? ఏం జరిగింది???

ఆ చెట్టు స్వంతదార్లలో చాలా మంది గతించి పోయారు. వారి వారసులుగా వారి మనుమలున్నారు. పోయినవారు పోగా- మిగిలిన వారు కరువును తట్టుకోలేక వారా భూమిని అమ్మేసుకున్నారు. అటువైపు ఇప్పుడెవరూ పోతున్నట్టులేదు. పీసుమామిడికి కొద్ది దూరంలో ఉన్న జొన్నలరాసి చెట్టు కూడా కనుమరుగయింది. ఎంత మారిపోయింది మా వూరు! ఆ పరిసరాల్లో ఎంత మార్పు ? పీసుమామిడి చెట్టు చుట్టూ వున్న పరిసరాలు ఎంత బాగుండేవో!

ఊరూరా-మాయదారి బేరగాళ్ళు. పశువులనూ ఉండనీయలేదు. చెట్లనీ ఉండనీయలేదు.

చిన్నా చితకా అని లేదు. ముసలీముతకా అని లేదు. అందరూ చెట్ల బేరగాళ్ళే. తమకు లాభాలు తీసుకువస్తాయనుకున్న ప్రతి చెట్టునూ కొని కొట్టుకు పోయారు. మార్కెట్లో విలువ తెలియని వారి నుంచి, పదికీ పాతికీ కొనడం- వేల రూపాయలకు అమ్ముకొని షోగ్గా తిరగడం. ఇక చెట్లు అమ్మిన వాళ్ళేమో - పోనీలే- ఎంతోకొంత డబ్బు చేతికందింది. అవసరాలు వెళ్లాయని తృప్తిపడ్డం.

ఎన్నేళ్ళు కష్టపడి పెంచితే- పీసు మామిడి చెట్టు అంత పెద్దదయింది? అదెంతమందికి నీడనిచ్చింది?? మరెంత మందికి ఆశ్రయమిచ్చింది. మరెన్ని ఫలాలనిచ్చింది? మరిప్పుడా పీసుమామిడేది ? ఈ తరం పిల్లల కోసం ఎవరు పెంచుతారు? మరెవరు- పంట పోతే పోయిందిలే పదిమందికి నీడనిచ్చే చెట్టు ఉండాలని కోరుకునే వారేరి??

నేను చనిపోయేంత వరకూ పీసుమామిడి చెట్టు జ్ఞాపకాలు నన్ను వీడిపోవు గామాలు!

కళ్లల్లో నుంచి నీరు బయటికి రావడానికి బిడియపడుతున్నట్లున్నాయి.

-గుడిపూడి సుబ్బారావు

■ ఇంటర్వ్యూ

హైదరాబాద్ నగర వీధుల్లో ఇప్పుడు పుస్తకాలు సంచరిస్తున్నాయి. ఇంటింటికి కూరగాయలు చేరడం ఎంత ముఖ్యమో పుస్తకం చేరడం కూడా అంతే ముఖ్యం అంటున్నారు సాదిక్. 'తోపుడు బండి' పేరుతో ప్రతి ఇంటికీ పుస్తకాన్ని చేర్చే ఆయన ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారు. కవిత్వంపై తనకున్న అమితమైన ఆసక్తితో కాలినడకన తిరుగుతూ ప్రతి ఒక్కరి వద్దకు ఆ కవిత్వాన్ని అందుబాటులోకి తెస్తున్న షేక్.సాదిక్ కాస్తా **'తోపుడుబండి సాదిక్'** గా మారిపోయారు. ఆయనతో 'సోపతి' సంభాషణ....

కవిత్వానికి కొత్త శోభ

మీకు 'తోపుడు బండి' ఆలోచన ఎలా వచ్చింది?

'కవిసంగమ' ఏర్పడిన నాటినుండి కవిత్వంపై ఆసక్తి పెరిగింది. ఎన్నో భావాలను చిన్న కవిత్వంలో చెబుతారు. దాంతో కవిత్వంపై తెలియకుండానే విపరీతమైన అభిమానం కలిగింది. నవలలతో పాటు కవిత్వానికీ ప్రాధాన్యం ఉంది. కాని నవలలు మాదిరిగా కవిత్వానికి సంబంధించిన పుస్తకాలు అమ్ముడుపోవడం లేదు. దీనికి కారణం ఏమిటని ఆలోచించాను. హైదరాబాద్, విజయవాడ బుక్‌ఫెయిర్‌లకు వెళ్ళి వచ్చిన తర్వాత ఈ ఆలోచన వచ్చింది. మంచి కవిత్వం గడప గడపకూ చేరాలనే ఈ ప్రయత్నం ప్రారంభించా.

ఇప్పటి పాఠకుల్లో కవిత్వానికి ఆదరణ ఉందంటారా?

కచ్చితంగా ఉంది. తోపుడు బండిపై పుస్తకాల కొనుగోలు చూస్తేనే అర్థమవుతుంది. తరం మారుతున్న కొద్ది యువత ఆలోచనలు మారతాయి. యువత వారి అభిరుచులకు తగిన కవిత్వాన్ని కచ్చితంగా ఆదరిస్తున్నారు. చదువుతున్నారు.

ఐతే 'తోపుడు బండి' ద్వారా కవిత్వానికి పూర్వ వైభవం వస్తుందంటారా?

రావాలనే కోరిక. మా వంతుగా ఒక ప్రయత్నం ప్రారంభించాం. కవిత్వానికి ఆ వైభవాన్ని తీసుకురావడానికి జరిగిన మొదటి ప్రయత్నం కవిసంగమం, రెండవది తోపుడు బండి. ఇలా మా తర్వాత కూడా కవిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఎవరో ఒకరు కచ్చితంగా ప్రయత్నిస్తారు. ఆ నమ్మకం ఉంది.

పుస్తకాలు అమ్మడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. మరి దీన్నే ఎందుకు ఎంచుకున్నారు?

పుస్తకాలు అమ్మడం నా వృత్తి కాదు. కేవలం కవిత్వాన్ని ప్రజలందరి దగ్గరకు చేర్చాలనే నా కోరిక. కవిత్వానికి ఆదరణ పెరగాలి. తెల్లవారితే ప్రతి ఇంటి వద్దకు తోపుడు బండిపై కూరగాయలు అమ్మేవారు వస్తారు. శారీరక ఆరోగ్యానికి తిండి ఎంత అవసరమో మానసిక ఆరోగ్యానికి పుస్తక పఠనం కూడా అంతే అవసరం. అందుకే ప్రతి ఇంటికి కూరగాయలు చేరినంత తేలిగ్గా పుస్తకాలు కూడా చేరాలని నా ఈ ప్రస్థానానికి తోపుడుబండి అనిపేరుపెట్టాను.

ఈ ప్రయత్నానికి ఇతరుల సహకారం ఏమైనా ఉందా?

చాలా ఉంది. నాకు ఈ ఆలోచన వచ్చిన వెంటనే మిత్రులు యాకూబ్, వాసిరెడ్డి గోపాల్‌లను సంప్రదించా. నా ఆలోచనకు వారి సహకారం తోడయింది. తోపుడు బండి పేరుపెట్టమని సలహా ఇచ్చింది కూడా వారే. చాలా మంది కవులు మంచి కవిత్వాలు రాస్తున్నారు. కాని అమ్ముడుపోక ఇబ్బందిపడుతున్నారు. పబ్లిషర్స్ ఎక్కువగా పెద్దవాళ్ళకు మాత్రమే సహకరిస్తారు. కొత్త కవులకు తాము రాసిన పుస్తకాలకు ఆదరణ ఉండడం లేదు. అందుకే మా తోపుడు బండిలో అటువంటి వారి కవిత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నాం.

మీ తోపుడు బండి ప్రస్థానం ఎక్కడ నుండి ప్రారంభించారు?

ఫిబ్రవరి 22న ఈ బండి రోడుపైకి వచ్చింది. రోజుకు 20 నుండి 30 కిలో మీటర్ల వరకు సాగుతోంది. మొదట రాంనగర్ గుండు నుండి ప్రారంభమయింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్, విఎస్‌టి, జవహర్‌నగర్, గాంధీనగర్, దోమలగూడ, బుద్ధ పూర్ణిమ, నెక్లెస్‌రోడ్ మీదుగా హైదరాబాద్ నగరం మొత్తం తోపుడు బండి వెళుతుంది. రోజులకు సుమారుగా 200 పుస్తకాలు అమ్ముడుపోతున్నాయి.

మరి ప్రజల్లో స్పందన ఎలా ఉంది?

చాలా బాగుంది. వాస్తవానికి దీన్ని ప్రారంభించేటపుడు ఇంత స్పందన ఉంటుందని అనుకోలేదు. కవులు తమ పుస్తకాలను బండి ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చి తమ పుస్తకాలను ఇచ్చి వెళుతున్నారు. రోడ్డుపై బండి నెట్టుకొని వెళుతుంటే అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఆగి మరీ పుస్తకాలను కొంటున్నారు. విద్యార్థులు, యువత బాగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం 160టైటిల్స్ తోపుడు బండిలో ఉన్నాయి. వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

ఇతర జిల్లాలకు ఏమైనా వెళ్ళే అవకాశం ఉందా?

కచ్చితంగా వెళుతుంది. ఈ పాటికే చాలా జిల్లాల నుండి ఫోన్లు వస్తున్నాయి. అనంతరపురం, ఖమ్మం, కామారెడ్డి, వైజాగ్, భీమవరం వారు తమ జిల్లాలకు రమ్మని అడుగుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రతి జిల్లా కేంద్రంలో, ప్రధాన పట్టణాలలో ఈ తోపుడు బండి వెళుతుంది. అయితే ఇదే బండి అక్కడకు వెళుతుందా...లేక ఎవరి జిల్లాల్లో వాళ్ళు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటారా అనేది ప్రణాళిక రూపొందించు కోవాలి. నేను మాత్రం పూర్తిగా రెండు మూడు సంవత్సరాల వరకు ఇదే కార్యక్రమాన్ని కొనసాగించాలనుకుంటున్నా.

– సలీమ, 9490099083

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

యాపిల్ 'స్మార్ట్ వాచ్' వచ్చేసింది !

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో తనకంటూ ముద్ర వేసుకున్న ప్రఖ్యాత సంస్థ యాపిల్. ఇప్పటివరకు మ్యాక్, ఐపాడ్, ఐఫోన్, మ్యాక్ బుక్, ఐప్యాడ్ వంటి అత్యుత్తమమైన ఉత్పత్తులతో చరిత్ర సృష్టించింది. తాజాగా మరింత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన "యాపిల్ వాచ్"ను 9వ తేదీ సోమవారం అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో విడుదల చేసింది. దీనికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను యాపిల్ సిఈవో టిమ్‌కుక్ వెల్లడించారు. దీనిని రెండు సైజులు, మూడు ప్రత్యేక మోడళ్లతో అత్యాధునిక ఫీచర్స్‌తో మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. యాపిల్ వాచ్‌లు విడుదలయ్యాయి. స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం, 18 క్యారట్ల గోల్డ్ కేస్‌లతో త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఈ వాచ్ ప్రస్తుతం తొమ్మిది దేశాల్లో విడుదలవుతుంది. ఏప్రిల్ 10నుంచి ముందస్తు బుకింగ్‌లు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 25 నుంచి డివైస్ లభ్యమవుతుంది. టెక్నాలజీ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సృష్టించుకున్న యాపిల్... 2010లో ఐప్యాడ్ తర్వాత మార్కెట్లోకి తెస్తున్న కొత్త ఉత్పత్తి ఇదే కావటం గమనార్హం.

ఈ స్మార్ట్ వాచ్... వేరబుల్ డివైస్‌లో నిక్షిప్తం చేసిన టాప్టిక్ ఇంజిన్ వాచ్‌కు నోటిఫికేషన్ అందిన ప్రతిసారీ ఓ నిగూఢమైన వైబ్రేషన్‌ను కలుగజేస్తుంది. ఈ వాచ్ మొత్తం... యాపిల్ వాచ్ స్పోర్ట్స్, యాపిల్ వాచ్, యాపిల్ వాచ్ గోల్డ్ ఎడిషన్లుగా అందుబాటులోకి రానుంది.

1. క్రీడాకారుల వెర్షన్: చిన్న స్క్రీన్ ధర 349 డాలర్లు (సుమారు రు.21 వేలు). పెద్ద స్క్రీన్ ధర 399 డాలర్లు.

2 మధ్యతరగతి వెర్షన్: చిన్న స్క్రీన్ ధర 549 నుండి 1049 డాలర్లు. పెద్ద స్క్రీన్ 599 నుండి 1099 డాలర్లు.

3 విలాసవంత వెర్షన్ : 18 కారట్ల బంగారంతో చేసిన వాచ్ ధర 10,000 డాలర్ల నుంచి ప్రారంభమవుతుంది. దీని గరిష్ట ధర 17,000 డాలర్లు (సుమారు రూ.10,20,000). డిస్‌ప్లే గ్లాస్‌ను సఫైర్(నీలం)తో తయారు చేశారు. ఇది కేవలం ఎంపిక చేసిన షోరూంలలో మాత్రమే లభిస్తుంది.

ప్రత్యేకమైన కస్టమ్ యూజర్ ఇంటర్‌ఫేస్‌తో రూపకల్పన చేయబడిన ఈ స్మార్ట్‌వాచ్‌కు 'డిజిటల్ క్రౌన్' ప్రధాన ఆకర్షణ. వాచ్ కుడివైపు భాగంలో ఏర్పాటు చేసిన ఈ డిజిటల్ క్రౌన్ బటన్‌ను ప్రెస్ చేయటం ద్వారా వాచ్ డిస్‌ప్లేను తాకకుండానే ఆన్‌స్క్రీన్ యాక్షన్లను నిర్వహించుకోవచ్చు. డిజిటల్ క్రౌన్ బటన్ యాపిల్ వాచ్‌కు హోమ్ బటన్‌గా కూడా ఉపయోగపడుతుంది. ఈ బటన్ ద్వారానే యాపిల్ వాయిస్ సెర్చ్ ఫీచర్ 'సిరీ'ని యాక్సెస్ చేసుకోవచ్చు. యాపిల్ వాచ్ డిస్‌ప్లే పటిష్టమైన ఫ్లెక్సిబుల్ రెటీనా ప్యానల్‌ను కలిగి ఉంటుంది. పటిష్టమైన సఫైర్ గ్లాస్‌ను వాచ్ డిస్‌ప్లేపై అమర్చారు. అంతేకాకుండా యాపిల్ కంపెనీ స్వయంగా డిజైన్ చేసిన ఎస్‌ఎస్‌ఐపీ సూక్ష్మ కంప్యూటర్ ఆర్కిటెక్చర్‌ను ఈ వాచ్‌లో ఏర్పాటు చేసారు. డెవలపర్ల కోసం వాచ్ కిట్ పేరుతో సరికొత్త వ్యవస్థను యాపిల్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఔత్సాహికులు ఈ వాచ్ కిట్‌ను ఉపయోగించుకుని డెవలపర్లు యాపిల్ వాచ్ కోసం కొత్త టూల్స్‌ను వృద్ధి చేయవచ్చు. తాజాగా విడుదలైన ఐఫోన్ 6, ఐఫోన్ 6 ప్లస్‌లతో పాటు ఐఫోన్ 5ఎస్, ఐఫోన్ 5సీ, ఐఫోన్ 5 స్మార్ట్‌పోన్లను కూడా యాపిల్ వాచ్ సపోర్ట్ చేస్తుంది. ఐఫోన్ 6, ఐఫోన్ 6 ప్లస్‌లలో ఏర్పాటు చేసిన యాపిల్ పే అనే పేమెంట్ అప్లికేషన్ ద్వారా సౌకర్యవంతంగా, సురక్షితంగా బిల్లులను చెల్లించవచ్చు. వినియోగదారులు పూర్తిస్థాయి ఆరోగ్య సంబంధిత, వ్యాయామ సంబంధిత ఉపకరణంగానూ దీన్ని ఉపయోగించుకోవచ్చని ఆవిష్కరణ సందర్భంగా కంపెనీ సీఈఓ టిమ్ కుక్ స్పష్టం చేసారు. వినియోగదారుడి ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని పర్యవేక్షించే ప్రత్యేక సెన్సార్ వ్యవస్థను యాపిల్ ఈ స్మార్ట్‌వాచ్‌లో నిక్షిప్తం చేసింది. మీ ఐఫోన్‌కు సంబంధించిన కార్యకలాపాలను నేరుగా ఈ స్మార్ట్ వాచ్ ద్వారానే నిర్వహించుకోవచ్చు. వాచ్‌ను స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానించిన అనంతరం నేరుగా వాచ్ ద్వారానే కాల్స్ చేయవచ్చు, కాల్స్ రిసీవ్ చేసుకోవచ్చు, మెసేజ్‌లను చెక్ చూసుకోవచ్చు.

వాచ్‌ల రంగంలో వందల ఏళ్లుగా స్విస్ కంపెనీలదే ఆధిపత్యం. బ్రిటన్, అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్ లకు చెందిన కంపెనీలు కూడా కొన్ని ఈ రంగంలో ఉన్నాయి. వీటిలో కొన్ని లగ్జరీ వాచ్ కంపెనీలూ ఉన్నాయి. అయితే.. ఈ లగ్జరీ కంపెనీలకు పోటీ ఇవ్వాలన్నది యాపిల్ లక్ష్యంగా కనబడుతోంది. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత దాదాపుగా వాచ్‌కు డిమాండ్ పడిపోయింది. టైము చూసుకోవడానికి ప్రత్యేకంగా వాచ్ పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో వాచ్‌ను లగ్జరీగానూ, ఇతరత్రా ఉపయోగపడే వస్తువుగానూ చేయాలని యాపిల్ భావిస్తోంది. యాపిల్ లక్ష్యం ఎంత మేరకు నెరవేరుతుందనే దానిపై భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమౌతున్నాయి. మణికట్టుకు పెట్టుకున్న వాచ్‌ని సెల్‌ఫోన్‌లా ఉపయోగించడం కష్టమైన విషయం. అయినప్పటికీ ఈ ఐవాచ్ విజయవంతంగా నిలబడుతుంది అని టిమ్ కుక్ నమ్మకంగా వున్నారు. ఇప్పటికే మోటరోలా, సామ్‌సంగ్, ఎల్‌జీ కంపెనీలకు చెందిన స్మార్ట్ వాచ్‌ల మార్కెట్‌ని ముంచెత్తాయి. కానీ ఇవేవీ మార్కెట్లో పెద్దగా డిమాండ్ క్రియేట్ చేయలేదు. ఇప్పుడు యాపిల్ ఐవాచ్‌తో మొత్తం ఈ సెగ్మెంట్‌కే వెలుగు వస్తుందని ఇతర స్మార్ట్‌వాచ్ తయారీ కంపెనీలు సైతం ఆశగా ఎదురుచూస్తున్నాయి. మరోవైపు ఈ ఏడాది చివరినాటికి దాదాపు 10 మిలియన్ల వాచ్‌లను అమ్మేందుకు

యాపిల్ కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఐఫోన్6 విజయవంతమైన నేపథ్యంలో 2015లో యాపిల్ నుంచి రాబోతున్న ఉత్పత్తులకు సంబంధించి అంచనాలు భారీగా పెరిగిపోయాయి. యాపిల్ వాచ్‌తో పాటు యాపిల్ టీవీ, ఐట్యూన్స్ రేడియో, ఐప్యాడ్ ప్రో, మాక్ బుక్ ఎయిర్, ఐఫోన్ 7, ఐఓఎస్ 9, ఓఎస్ ఎక్స్ తదితర కొత్త ఉత్పత్తులు ఈ ఏడాది మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది.

కొన్ని ముఖ్యాంశాలు : * యాపిల్ వాచ్ రెండు సైజులలో లభ్యం కానుంది. ఒకటి 30 మిల్లీమీటర్ల సైజ్ వేరియంట్ కాగా మరొకటి 42 మిల్లీమీటర్ల సైజ్ వేరియంట్. * ఈ స్మార్ట్ వేరబుల్ డివైస్‌లో నిక్షిప్తం చేసిన టాప్టిక్ ఇంజిన్ వాచ్‌కు నోటిఫికేషన్ అందిన ప్రతిసారి ఓ నిగూఢమైన వైబ్రేషన్‌ను కలగజేస్తుంది.* యాపిల్ వాచ్‌ను హెల్త్ ఇంకా ఫిట్నెస్ బ్యాండ్‌లా ఉపయోగించుకోవచ్చు. * యాపిల్ కంపెనీ స్వయంగా డిజైన్ చేసిన ఎస్‌ఎస్‌ఐపీ సూక్ష్మ కంప్యూటర్ ఆర్కిటెక్చర్‌ను ఈ వాచ్‌లో ఏర్పాటు చేసారు. * ఐఫోన్ 6, ఐఫోన్ 6 ప్లస్‌లలో ఏర్పాటు చేసిన యాపిల్ పే అనే పేమెంట్ అప్లికేషన్‌ను ఈ స్మార్ట్‌వాచ్ సపోర్ట్ చేస్తుంది. * సిరి వాయిస్ కమాండ్ అప్లికేషన్ ఈ వాచ్ సపోర్ట్ చేస్తుంది. *వాచ్‌ను స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధా నించడం ద్వారా నేరుగా వాచ్ నుంచే కాల్స్ చేయవచ్చు, రిసీవ్ చేసుకోవచ్చు, మెసేజ్‌లను చెక్ చూసుకోవచ్చు. * మ్యాగ్నటిక్ చార్జర్ ఆధారంగా యాపిల్ వాచ్‌ను చార్జ్ చేసుకోవచ్చు. 18 గంటల బ్యాకప్ ఇస్తుంది. * హృదయ స్పందనలను (హార్ట్ బీట్), వారు చేసే వ్యాయామం వివరాలను కూడా నమోదు చేయొచ్చు. * చేయవలసిన పనులను(రిమైండర్స్) మణికట్టు మీద తట్టి మరీ గుర్తు చేస్తుంది. * ఎయిర్‌పోర్ట్‌లలో చెక్‌ఇన్ చేయటానికి, కొన్ని హోటల్స్‌లో గదులకు, కారులకు తాళం చెవిగాను.. యాపిల్ పే క్రెడిట్ కార్డుగానూ ఉపయోగపడుతుంది. * ఫోన్ కాల్స్ రిసీవ్ చేసుకునేందుకు బిల్ట్‌ఇన్ స్పీకర్, మైక్రోఫోన్స్ ఉన్నాయి. * ఫిట్‌నెస్‌ను ట్రాక్ చేసేందుకు, వ్యాయామాలను సూచించేందుకు వర్కవుట్ యాప్ కూడా ఉంది. ఈ స్మార్ట్ వాచ్‌లో రకరకాల అప్లికేషన్లకు (యాప్), సెన్సర్లు ఉన్నాయి.

రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం ■ **సమీక్షలు**



సమగ్ర చీడపీడల
యాజమాన్యం వైపుగా...
డా॥ ఇ.ఆర్.సుబ్రమణ్యం
వెల : 20/-, పేజీలు : 38
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్ హౌస్
27-1-54, ఏలూరు రోడ్,
గవర్నర్ పేట, విజయవాడ-2
ఫోన్ : 0866-577533

బతుకుబాటలో పులి
కె.ఉల్లాస్ కారంత్
తెలుగు : డా॥కె.బి.గోపాలం
వెల : 120/-,
పేజీలు : 152
ప్రతులకు :
విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

జీవన సందర్భాలు (నానీలు)
రమణ వెలమకన్ని
వెల : 30/-
పేజీలు : 51
ప్రతులకు :
అన్ని పుస్తక కేంద్రాలు.
వి.స్వర్ణలక్ష్మి,
ఫోన్ :9866015040

చిన్న పిల్లలు దంత సమస్యలు
డా॥కె.యల్.వి.ప్రసాద్
వెల : 100/-, పేజీలు : 119
ప్రతులకు : కె.అరుణ కుమారి
24-7-322/5, సహృదయ
మార్గ్, రామకృష్ణ కాలనీ,
హన్మకొండ.
ఫోన్ : 9989842757



తెలుగు
వేంపల్లె షరీఫ్
వెల : 25/-
పేజీలు : 28
ప్రతులకు :
విశాలాంధ్ర,
ప్రజాశక్తి,
నవోదయ పుస్తక కేంద్రాలు

ప్రగతిశీల కవిత్వం

నేను సైతం, గుడిసె శ్రీనివాసరావు (లెనిన్ శ్రీనివాస్)
పేజీలు : 108, వెల 100/- రూ.
ప్రతులకు: లెనిన్ శ్రీనివాస్, సాహితీ కుటీరం
కాచిరాజుగూడెం. ఖమ్మం-507003,
ఫోన్ నెం. 9490471120

డా॥అద్దేపల్లి రామ్మోహనరావు చక్కటి విలువైన ముందుమాట రాసారు. అలాగే సాధనాల వెంకటస్వామి నాయుడు; డా. మల్ల వీరప్ప వేంకటరావు ఈ పుస్తకానికి కూడా అభిప్రాయాలు రాసారు. "కావ్యాంకితం వాక్యాలు"తో ఆరంభమై "శత జయంతికి శతకోటి వందనాలు" (శ్రీశ్రీకి..). ముగించిన 44 కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి. అన్ని ప్రగతిశీలంగా; వస్తు వైవిధ్యంతో వున్నాయి. ఇద్దరు ముగ్గురు వ్యక్తుల్ని కీర్తించినవీ వున్నాయి. మరణ మృదంగం, ధిక్కార గర్జన, చేదు గాయం, గ్రీష్మతాపం, అంటరాని కోకిల, అక్షర సేద్యం, మానని గాయం, ఉద్యమ కెరటం, అక్షరం నా ఆయుధం అనే కవితలు.. కవియొక్క కలం యొక్క వేగాన్ని, పదునును తెలియజేస్తాయి.

ఏది ఏమైతేనేం- విశ్వసనీయత కోల్పోతుంది ఓటు హక్కు! అంటారు ఏ ప్రస్థానానికో అనే కవితలో కవి. (పేజీ.61)

వస్తువుపై ఆసక్తి; ప్రతిఘటనపై ప్రేమ; అభిప్రాయాలతో విసురు, విరుపు; భావ తీవ్రత; వామపక్ష ఉద్యమాభిలాష కవితల్లో ప్రస్ఫుటించే గుడిసె శ్రీనివాస్ కవితం గుండె పొరల్లోంచి వచ్చింది.. అట్టడుగు శ్రామికుల వాణి-బాణి వినిపించిన "నేను సైతం" కవితా సంపుటి ప్రయోగాత్మకం. లెనిన్ మరిన్ని మంచి కవితలు.. శిల్ప జోడింపుతో శక్తివంతంగా రాయాలని ఆశిద్దాం!

- తంగిరాల చక్రవర్తి, 9393804472

తాత్విక అంశాల విశ్లేషణ



నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు
పేజీలు: 230, వెల: రూ. 125
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

తత్వశాస్త్రంలో పిహెచ్‌డి చేసిన నరిసెట్టి ఇన్నయ్యా గారు సుదీర్ఘకాలంగా రచనలు చేస్తున్నారు. రచయితగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా విభిన్న అంశాలపై వ్యాసాలు రాస్తున్నారు. కొన్నిసార్లు సంచలనాత్మక అంశాలపై ఆధారాలతో సహా అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన రాసిన వ్యాసాల్ని 'మిసిమి' ప్రచురించింది. 'నరిసెట్టి ఇన్నయ్యా మిసిమి వ్యాసాలు' శీర్షికన వచ్చిన ఈ పుస్తకంలో దాదాపు నలభై వ్యాసాలున్నాయి. సుభాష్ చంద్రబోస్ గెలిస్తే ఈ దేశం ఏమయ్యేది? అనే వ్యాసంతో మొదలయి, 'హోల్‌టైం ఎడిటర్: ఆలపాటి రవీంద్రనాథ్' అనే వ్యాసంతో ముగుస్తుంది. అనేకమంది వ్యక్తుల ప్రస్తావన, వారి కంట్రిబ్యూషన్ గురించిన అంశాలు ఈ వ్యాసాల్లో ఉన్నాయి. లెనిన్, స్పినోజా, లెబ్నిజ్, సంజీవ్‌దేవ్, బెర్ట్రాండ్ రస్సెల్, ఎం.ఎన్.రాయ్, శాంతిదేవి, రావిపూడి వెంకటాద్రి, ఎరిక్ ఫ్రామ్, పీటర్ సింగర్ వంటి వారి గురించి ఈ పుస్తకంలో ఇన్నయ్యా గారు వ్యక్తపరచిన అభిప్రాయాలు విస్మయానికి లోను చేస్తాయి. ఇంద్రియాతీత శక్తులనే భావనల్ని కూడా చర్చించారు. పోస్టు మోడరనిజంలోని సారాంశాన్ని విశ్లేషించారు. ప్రతి వ్యాసమూ ఆసక్తికరమైంది. కొత్త ఆలోచనల్ని ప్రోది చేస్తుంది. కొన్ని అంశాల్లో వారి అభిప్రాయాలు అంగీకరించలేకున్నా, వారి వాదనా పద్ధతి ఆకట్టుకునేలా వుంది. కనుకనే ఈ పుస్తకం చదవాలి. తాత్విక పరమైన ఆలోచనలకు దారితీస్తుంది.

జ్ఞాపకాల్లోకి తీసుకెళ్ళే నవల

చిత్రసుందరి (నవల),
తమిళమూలం: అఖిలన్,
అనువాదం: మధురాంతకం రాజారాం
పేజీలు: 348, వెల: రూ. 230,
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

మానవ సంబంధాల్లోని వైచిత్రినీ, సంక్లిష్టతల్నీ అత్యంత వాస్తవికంగా చిత్రించిన నవల 'చిత్రసుందరి'. జీవితంలో అనుకోకుండా తారసపడే సంఘటనలు నవలారచనకు ఏవిధంగా ప్రేరణ అవుతాయో రచయిత ముందుమాట తెలియజేస్తుంది. తమిళ రచయిత అఖిలన్ రాసిన నవల ఇది. దీనికి ఆయన రాసిన ముందుమాల నవలకు ప్రేరణ ఏమిటో తెలియజేసింది. అప్పట్లోనే మధురాంతకం రాజారాం దీనిని తెలుగులోకి అనువాదం చేశారు. నవలగా తొలుత తమిళంలో సీరియల్‌గా వచ్చింది. తర్వాత పుస్తకరూపంలో వెలువడింది. తర్వాత చాన్నాళ్ళకు జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన రచన ఉదాత్తమైన నవల ఇది. సరళమైన శైలిలో జీవితం ఎన్నెన్ని ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూ ఎలా మలుపు తిరుగుతుందో చెప్పడం ఈ నవలలో చూడొచ్చు. భారతదేశంలోని ఇరవయ్యో శతాబ్దపు గొప్ప నవలల్లో ఒకటి 'అఖిలన్'.

ఏదయితే జరగకూడదని అఖిలన్ భావించరో అదే ఆ తర్వాత కాలంలో తమిళనాడులో జరిగింది. సినిమా తారలకు కూడా గుడి కట్టే ప్రమాదముందని నలభై ఏళ్ళ కిందటనే ఈ నవలలో హెచ్చరించారు అఖిలన్. కుష్బూకి గుడి కట్టిన వైనం ఆ తర్వాత జరగనే జరిగింది. దూరదృష్టిని ప్రదర్శించగల రచయిత నైపుణ్యానికి ఇది నిదర్శనం.

"కళాపోషణ అన్నది ధనవంతులకు మాత్రమే పరిమితమని మేమనుకోవడం లేదు. నిజమైన కళాకారులు ప్రజాస్వామ్యానికి దూరమైపోవడం వల్ల, డబ్బు కోసం ఎలాంటి హీనమైన పనికైనా ఒడిగట్టే అవినీతిపరులు కొందరు యిక్కడ జనాన్ని దోచుకుంటున్నారు. తరతరాలుగా ఆ దేశ సంస్కృతికి అద్దం పడుతూ వచ్చిన ఒక విశిష్టమయిన పండుగ దినాన్ని పురస్కరించుకొని, యిటీవల యిక్కడ కొన్ని అభాసపనులు జరిగిపోతున్నాయి. ఇలాగే మరికొంతకాలం గడిస్తే మా వీరకిశోరులు అందుకని ప్రత్యేకంగా గుళ్ళు నిర్మించి వాటిలో సినిమాతారల విగ్రహాలను ప్రతిష్టించినా ప్రతిష్టించగలరు..." (చిత్రసుందరి నవల - పేజీ: 296) - ఈ మాటల్ని కొన్ని దశాబ్దాల కిందటే అఖిలన్ నవలలో రాశారు. తమిళనాడులోనే కాదు తెలుగులోనే వేలంవెర్రిగా ఉన్న సినిమా అభిమానుల చేష్టలు గమనిస్తే సాంస్కృతిక విలువల పతనం ఎలా వున్నదో బోధపడుతుంది.

ఇది నవలలో ఒక అంశం మాత్రమే. నవలలో ఇంకా అనేకానేక అంశాలు అభివ్యక్తమయ్యాయి. సరళమైన శైలీ సంవిధానం వల్ల నవల చదివించేలా ఉంది. వాడుకభాషలో ఉన్న సంభాషణలు సులభగ్రాహ్యంగా ఉన్నాయి. సుదీర్ఘమైన జీవితంలోని మలుపుల్ని నవలలోకి తీసుకురావడంలో రచయిత చూపిన ప్రతిభ అనన్యమైంది. నవల చదివాక కొన్ని పాత్రలు, కొన్ని సంఘటనలు గుర్తుండిపోతాయి. పాఠకులు తమ అనుభవ నేపథ్యంలోకి వెళ్ళి పాత్రల్ని గురించి ఆలోచిస్తారు.

- దుర్గాప్రసాద్

ఆర్ద్రమైన భావాల సంపుటి

సంచీలో దీపం (కవిత్వం),
రచన: హిమజ,
పేజీలు: 112, వెల: రూ. 60
ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్,
ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా
కాచిగూడ చౌరస్తా,
హైదరాబాద్-500 027



విభిన్న అనుభవాలు, సామాజిక సంఘటనలకు ప్రతిస్పందనలు కలగలసిన కవిత్వాన్ని హిమజ సృజించారు. 'సంచీలో దీపం' పేరుతో వచ్చిన ఆమె కవితా సంపుటిలో 45 కవితలున్నాయి. ఆమె కవితా వస్తువుల్లో తెలంగాణ సంవేదనలున్నాయి. ప్రత్యేక ఆకాంక్షలకు గల మూలాల్ని స్పర్శించారు. జ్ఞాపకాలు ఘనీభవించి బరువెక్కించిన సన్నివేశాల్ని కవిత్వం చేశారు. ప్రయాణాలు మనసునీ, మనిషినీ పదునెక్కించే వైనం ఎలా ఉంటుందో చెప్పారు. ఒక మహిళగా అనుభవించే సంవేదనల్ని హిమజ కవిత్వం ఆవిష్కరించింది. తెలంగాణ పల్లెలు, పట్నాలకు సంబంధించిన అంశాల్ని ప్రస్తావించారు. జీవితంలోని సంక్లిష్టతలకు గల మూలాల్ని పట్టుకునే ప్రయత్నం చేస్తుందీ కవిత్వం. ఊరుతో ఉండే అనుబంధాన్ని పలవరించారు. చాలామందికి సొంత ఊరు మీద ప్రేమ వుంటుంది. ఊరి నుంచి వచ్చిన ఊరిని అంటిపెట్టుకునే జ్ఞాపకాలుంటాయి. ఊరుకు వెళ్ళినప్పుడు మిశ్రమానుభూతులకు లోనవుతారు. కనుక 'నాలుగు లైన్ల రహదారి', 'పల్లె తల్లి గుండె సప్పుడు' వంటి కవితలు చదివినప్పుడు గుండె ఆర్ద్రమవుతుంది. సున్నితమైన అనుభూతుల్ని రమ్యమైన రీతిలో కవిత్వం చేయడం ఈ పుస్తకంలో కనిపిస్తుంది. భావానికి తగిన పదచిత్రాలతో, భావచిత్రాలతో పాఠకుల్ని కదిలించే కవిత్వధారను హిమజ అందిస్తున్నారు.

- కుమార్

గమనిక

➽ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➽ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➽ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా:
సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక,
ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

■ ఈ వారం కవిత్వం

పదమూడు గీతల యాభై చుక్కల ముగ్గు

మూగ జీవమై మూడో ప్రపంచం
ప్రేతకళతో బలిపీఠాన్నలంకరిస్తుంటే
సామ్రాజ్యవాద కాంక్షతో తెల్ల మాంత్రికుడు
పదమూడు గీతల, యాభై చుక్కల
ముగ్గు గీసి, క్షుద్ర పూజ చేస్తున్నాడు.

సకల ఉత్పాతాలకూ మూలమైనవాడే
మానవాళికి ఓ నియమావళి రచిస్తుంటే
దెయ్యాలే వేదాలు వల్లిస్తున్నట్టుంది.
వాడి యాంత్రిక సౌఖ్యాల యాగం కోసం
పసుపు పసిడి చమురు కుండలపై
కన్నేసింది ఆ గండ భేరుండం.
ద్రవ్య నిధుల, సంయుక్త రాజ్య సమితుల
అంజనాలు కట్టి, సమ్మోహితుల్ని చేసి
మూల్గుతున్న మూడో ప్రపంచాన్ని
చంకలో దర్భపుల్లలా నలిపేస్తున్నాడు
ఉన్మత్త రాజ్యాల దృష్టికది ఉత్కృష్ట హవనం
కానీ, వాస్తవానికది దుర్బల జాతుల హననం
కుయుక్తులతో... ఎత్తులు, పై ఎత్తుల్లేని
ఏక పక్ష చదరంగంలో
భూగోళంపై ఒక్కోదేశాన్ని ఒక్కో గడిగా తలచి
దురాక్రమణ చేస్తున్న నీతిమాలిన ఆటగాడు.
ఐక్యత లేని అన్నదమ్ములకు,
సఖ్యత చెడ్డ ఇరుగుపొరుగుకీ
అస్త్రాలు, అమ్ములు అమ్ముకుంటూ
శాంతి మంత్రాలు వల్లించే 'కపటి'వాడు.
శాంతి పేరిట జరుగుతోంది నరమేధం,
శ్వేత సౌధానికి, స్వేద సౌగంధానికి నడుమ
ఇది అంతులేని సమరం.

– మల్లారెడ్డి మురళీ మోహన్, 8861184899

మొదటి మెట్టు

ఏ ఒక్క సృజన కార్యమైనా చేసిన దాఖలాలు లేవు
నీకు నువ్వే గొప్పని విర్రవీగుతున్నావు –

గుండె దీపం వెలిగించి చూశావా ఎప్పుడైనా
బాల భాస్కరుడ్ని – నిరంతర శ్రమజీవిని

గరికపూలపై మంచు ముత్యాల్ని ముద్దాడావా ఎప్పుడైనా
తంగెడుపూల వనాల్లో తన్మయంగా విహరించావా ఎప్పుడైనా

ఉద్వేగాల, ఉద్రేకాల నిప్పుతో
ఆటలాడుకోవటం నేర్చుకున్న
ఆధునిక మానవుడి గురించి
నాలుగు మంచి మాటలు మాట్లాడావా ఎప్పుడైనా –

చదువుకోవాలని తపనపడే బాల్యానికి
చేతనత్వాన్నిచ్చావా ఎప్పుడైనా
కులమతాల్ని పక్కన పెట్టి ప్రతిమనిషినీ
ఆత్మీయంగా హత్తుకున్నావా ఎప్పుడైనా –

పడమటి గాలుల్లో అలమటిస్తూ
ఎక్కిళ్ళుపట్టి ఏడుస్తున్న బతుకులకు
దిక్కయ్యావా ఎప్పుడైనా
నీకు నువ్వే గొప్పని విర్రవీగుతున్నావు –

మరచిపోతున్నావు కదూ – నువ్వెక్కిన మొదటి మెట్టు

మొదటిమెట్టంటే
నేలను ముద్దాడుతూ
రెండో మెట్టుకు పునాది...!

– కె.విల్సన్‌రావు, 8985435515

ఇటుక శిల్పాలు

ప్రతి కళా ప్రత్యేకమైనదే. అందులోనూ ఎంబోజింగ్ చేసినవైతే మరీ ఆకర్షణీయంగా ఉంటాయి. పేపర్‌తో చేసే ఎంబోజింగ్ కళాకృతులే ఎక్కువగా చూస్తుంటాం. ఇటుకలతో చేసే ఈ కళ కష్టమైనదైనా బ్రాడ్ స్పెన్సర్‌కు ఈ కళాకృతులు చేయడం చాలా ఇష్టం. మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేసిన స్పెన్సర్ ఈ ఇటుక శిల్పాల తయారీకి క్లే, ప్లాస్టర్, సిమెంట్, కంచుల మిశ్రమాన్ని ఉపయోగించారు.



చరిత్రకు సాక్ష్యం

జర్మన్ నియంత హిట్లర్ గురించి, అక్కడి నాజీల అరాచకాల గురించి తెలియని వారుండరు. తన ఆధిపత్యం రుజువు చేసుకోడానికి చేయని అక్రమాలు, దౌర్జన్యాలు లేవు. అతని దుశ్చర్యలో భాగంగానే జర్మన్‌లోని లిడీస్ అనే గ్రామంలో నాజీలు జరిపిన పేలుళ్ళ ధాటికి ఒకేసారి 340 మంది చనిపోయారు. వాళ్ళలో 88 మంది చిన్నారులు కూడా ఉన్నారు. నాటి సంఘటనకు గుర్తుగా లిడీస్‌లో 'యుద్ధంలో చనిపోయిన పిల్లల స్మారకం' పేరుతో 1990లో మారీ ఉచయ్‌తిలోవా అనే కళాకారుడు 82 మంది చిన్నారుల కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేశాడు. దేనికోసమో, ఎవరి కోసమో దీనంగా ఎదురు చూస్తున్నట్టు ఉన్న ఈ చిన్నారులను చూస్తుంటే మనసు ద్రవించకుండా, హిట్లర్‌పై ఆగ్రహం కలగకుండా ఉంటుందా?!